


Truth of News
PRGI Reg No: APTEL/26/A4781
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 03 | సంచిక : 22 | మంగళవారం 01 సెప్టెంబర్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

# ఇరాన్ అధ్యక్షుడిని కలిసిన పీఎం మోడీ



**న్యూఢిల్లీ– సూర్య వాస్తవం :**
కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సు సందర్భంగా ఇరాన్ ప్రెసిడెంట్ మసూద్ పెజెష్కియన్ ను పీఎం మోడీ కలిశారు. అంతకముందు పీఎం మోడీ భారత పీఎం మోడీ, ఆర్మేనియా ప్రధాని నికోల్ పషిన్యాన్‌తో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఇరు దేశాల అధినేతల రక్షణ రంగంలో తోడ్పాటును పరస్పరం అందింపుచ్చుకొనున్నారు. 2020లో భారత్–అర్మేనియా రక్షణ భాగస్వామ్యం ఊపందుకుంది. అర్మేనియా ఎటిఎజిఎస్ టోవ్డ్ ఆర్టిలరీ గన్ సిస్టమ్, మల్టీ టెర్రైన్ ఆర్టిలరీ గన్ మార్గ 155ఎంఎం సెల్ఫ్–ప్రొపెల్డ్ హోవిట్జర్, ఎఎల్ఎస్ 51 డ్రోన్లు, జెన్ యాంటీ–డ్రోన్ సిస్టమ్ మరియు పినాకా మల్టీ–బ్యారెల్ రాకెట్ లాంచర్ సిస్టమ్‌లను కూడా కొనుగోలు చేసింది.

# ఆర్ఎస్ఎస్ హెడ్డాఫీస్ ముట్టడి

**- ఢిల్లీలో యూత్ కాంగ్రెస్ నేతల నిరసన**
**- ఖర్గేకు అవమానంపై కన్నెర్ర**



**న్యూఢిల్లీ– సూర్య వాస్తవం :**
ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు జరిగిన అవమానానికి బాధ్యత వహిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలనే డిమాండ్‌తో యూత్ కాంగ్రెస్ జాతీయ విభాగ నేతలు ఢిల్లీలో చేపట్టిన నిరసన ఉద్రిక్తతలకు దారితీసింది. ఖర్గే పర్యటన ప్రాంతంలో కొందరు శుద్ధీకరణ చేపట్టారని, ఆ శుద్ధీకరణ కులోన్మాదానికి పరాకాష్ట అంటూ యూత్ కాంగ్రెస్ నేతలు దేశ రాజధానిలోని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయ ముట్టడికి పిలుపునిచ్చా రు. శుద్ధీకరణకు పూనుకున్న బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. యూత్ కాంగ్రెస్ జా తీయ అధ్యక్షుడు ఉదయ్‌భానుచిబ్ నాయకత్వంలో ఈ ఆందోళన జరిగింది. నిరసనకారులు రాజ్యాంగ

- మిగతా 2లో..



# 5న సీజేపీ మార్చ్‌ను ఆపలేం

**- అవాంఛనీయ ఘటనలు జరుగుతాయని ముందే ఊహించలేం**
**- స్పష్టం చేసిన సుప్రీం ధర్మాసనం**
**- మార్చ్‌కు ముందే విచారణ చేపట్టాలన్న పిటిషనర్ విజ్ఞప్తి తిరస్కరణ**
**- కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులకు నోటీసులు జారీ**
**- విద్యార్థులపై కేసుల ఎత్తివేతకు సుప్రీంను ఆశ్రయించిన కేంద్రం**

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం :**
కేసులను ఉపసంహరించడంలో కేంద్రం విఫలమైందని విమర్శిస్తూ ఈ నెల 5న ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తలపెట్టిన నిరసన ప్రదర్శనను ఆపలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నిరసన సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరుగుతాయని ముందుగానే ఊహించి ఆదేశాలు జారీ చేయలేమని తెలిపింది. శాంతి భద్రతలు, అనుమతులు వంటి అంశాలు ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసుల పరిధిలో ఉంటాయని పేర్కొంది. దేశ రాజధానిలోని సున్నిత ప్రాంతాల్లో భారీ నిరసనలు, ర్యాలీలు నిర్వహించాలంటే సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా ఉండేలా ఆదేశాలు ఇవ్వాలని రిటైర్డ్ ఢిల్లీ పోలీసు అధికారి రాజేంద్ర సింగ్ దాఖలు చేసిన పిటిషన్ ను సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనాలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులకు నోటీసులు జారీ చేసింది. అయితే ఈనెల 5కు ముందే విచారణ చేపట్టాలన్న పిటిషనర్ విజ్ఞప్తిని తిరస్కరించింది. తదుపరి విచారణను ఈనెల 10కి వాయిదా వేసింది. విద్యార్థుల నిరసనలకు సంబంధించిన ఇతర కేసులతో కలిపి దీనిని విచారించనున్నట్టు

- మిగతా 2లో..

# ఇక దూసుకుపోవడమే!

**- జలహారతితో ప్రాజెక్టును ప్రారంభించిన సీఎం**
**- పండుగలా కార్యక్రమం**
**- పరవశించిపోయిన ముఖ్యమంత్రి**
**- జయహో చంద్రన్నా అంటూ జనం జేజేలు**
**- కాలువ పొడవునా బారులు తీరిన ప్రజలు**
**- వైపాలెం, మార్కాపురం ప్రాంతాల నుంచి కదిలిన ఊరూవాడా**
**- రాత్రికి సుంకేశుల గ్యాప్‌కు చేరిన కృష్ణా జలాలుజ**



**ఒంగోలు– సూర్య వాస్తవం :**
ప్రజల దశాబ్దాల కలను నెరవేరుస్తూ సోమవారం మధ్యాహ్నం వెలిగొండ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసిన సందర్భం, ఆతర్వాత జరిగిన బహిరంగ సభ ఓ చారిత్రాత్మక ఘట్టాలుగా మిగిలిపోనున్నాయి. రాజకీయాలకు అతీతంగా జనం తరలివచ్చారు. కూటమి పార్టీల వారు సభ ఆవరణలోకి ప్రవేశించగా.. గ్రామాలలో ప్రత్యర్థి పార్టీల వారిగా ముద్రపడిన వారు కూడా కృష్ణా జలాలను కళ్లారా చూసేందుకు కాలువల పొడవునా బారులుతీరి జలాలకు స్వాగతం పలికారు. తొలుత నీటిని విడుదల చేసి జలహారతి ఇచ్చిన చంద్రబాబు అనంతరం సభలో గతం వలే కాకుండా కేవలం అర్ధగంటలోనే ఉపన్యాసం ముగించారు. మరో 20 నిమిషాలపాటు జయజయధ్వానాలతో పులకించిపోతున్న జనంతో కలిసి తన ఆనందాన్ని పంచుకున్నారు.

**రెండేళ్లలో రెండోదశ పూర్తి**

వెలిగొండ ప్రాజెక్టు పుట్టుపూర్వోత్తరాలను, తాను ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో జరిగిన కీలకమైన పనుల వివరాలను విడమరిచి చెప్పిన చంద్రబాబు ఇక ఆగేది లేదంటూ ప్రాజెక్టు రెండోదశను 2028కే పూర్తిచేస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన ప్రధాన హామీలను ఎలా నెరవేర్చింది వివరిస్తూ రెండోదశ పూర్తికి హామీ ఇచ్చారు. తద్వారా మార్కాపురం, ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాల పరిధిలోని 4.47లక్షల ఎకరాలకు సాగునీటితోపాటు 23 లక్షల మందికి తాగునీటిని అందించి ప్రాజెక్టు లక్ష్యాన్ని పూర్తిగా నెరవేరుస్తానని చెప్పారు. సెప్టెంబరులోనే హార్టికల్చర్ హబ్ ప్రారంభిస్తున్నామని దాని ద్వారా ఉమ్మడి ప్రకాశం జిల్లాకు ఎంతో మేలు చేకూరుతుందని చెప్పారు.

అలరించిన నృత్యాలు.. మంత్రముగ్ధులైన బాబు

ప్రాజెక్టు నుంచి నీరు విడుదల, జలహారతి సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సుమారు 5వేల మంది గిరిజన బాలికలతో నృత్యరూపకాలను ప్రదర్శించారు. మంత్రముగ్ధులైన బాబు వారితో కలిసి ఫొటోలు, సెల్ఫీలు దిగి తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. కృష్ణా జలాలు సొరంగం నుంచి బయటకు వచ్చి వెలిగొండ ఫీడర్ కెనాల్‌లోకి, అనంతరం కిందకు రాగానే వాటిని చూసిన బాబు పులకించిపోయారు. అక్కడి నేలను ముద్దాడారు. సాష్టాంగ నమస్కారం చేశారు. నీటిని తన

- మిగతా 2లో..



# '142'తో ఆ కేసులను సుప్రీం కోర్టు రద్దు చేయొచ్చు: కేంద్రం

**హైదరాబాద్ – సూర్య వాస్తవం :**
గత నెల జూలై 20న నీట్ పేపర్ లీక్ ను వ్యతిరేకిస్తూ సీజేపీ పార్లమెంట్ మార్చ్ నిర్వహించిన విషయం తెలిసిందే. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, పరీక్షా విధానంలో సమగ్ర సంస్కరణలు తీసుకురావాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఆ సమయంలో యువతపై భద్రతా బలగాలు విచక్షణ రహితంగా లాఠీచార్జ్ చేశాయి. అంతేకాకుండా విద్యార్థులపై పెల్లెట్ గన్స్ ప్రయోగించారు. దీంతో పలువురు విద్యార్థులు తీవ్రంగా గాయబడ్డారు. నిరసనలో పాల్గొన్న అనేక మంది యువతపై ఢిల్లీ పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసుల దమనకాండాపై పార్లమెంట్ లో విపక్షాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ పార్లమెంట్ పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన కూడా చేశారు. తాజాగా ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం సుప్రీంలో పిల్ దాఖలు చేసింది. నిరసనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్ ను రద్దు చేయాలని పిటిషన్ వేసింది. ఎఫ్ఐఆర్‌లను రద్దు చేయడానికి రాజ్యాంగంలోని ఆర్టికల్

- మిగతా 2లో..

## అంతర్జాతీయవిద్య కోసం
# ప్రత్యేక టాస్క్‌ఫోర్స్

**- దాని నాయకత్వ బాధ్యతలు నావే..**
**- మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు అదే ఊపిరి..సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ**
**- విదేశీ పర్యటనపై నివేదిక అందజేసిన 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం**
**- నర్సరీ నుంచే విద్యావ్యవస్థలో సమూల మార్పులు : నివేదికలో వెల్లడి**



**హైదరాబాద్ – సూర్య వాస్తవం :**
రాష్ట్ర విద్యార్థులు, యువతకు హైదరాబాద్‌లోనే ప్రపంచస్థాయి ప్రమాణాలతో కూడిన విద్య, నైపుణ్యాలు అందేలా రూపుదిద్దు కుంటున్న ప్రత్యేక 'టాస్క్‌ఫోర్స్'కు తానే స్వయంగా నాయకత్వం వహిస్తానని సీఎం ఏ రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీన్ని వెంటనే అమల్లోకి తేవాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. తెలంగాణను 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న లక్ష్యానికి ఇది ఊపిరి

- మిగతా 2లో..



# కొనుగోలుదారుగానే మిగిలింది !

**- భారత్‌కు సాంకేతిక పరిజ్ఞానం బదిలీకి అమెరికా నో**
**- శుభం కార్డు పడని 16 సంవత్సరాల జావెలిన్ ఒప్పందం కథ**

**చండీఘర్ – సూర్య వాస్తవం :**
సైనిక అవసరాల కోసం అమెరికాలో తయారైన ఎఫ్‌జీఎం–148 జావెలిన్ యాంటీ ట్యాంక్ గైడెడ్ క్షిపణులను (ఏటీజీఎం) దిగుమతి చేసుకోవడానికి భారత్ ఎట్టకేలకు అంగీకరించింది. ఈ ఆయుధ వ్యవస్థ కోసం 16 సంవత్సరాల క్రితమే అమెరికాను భారత్ సంప్రదించింది. సుదీర్ఘ కాలం తర్వాత ఇప్పుడు ఒప్పందం కుదిరింది. ఆయుధ వ్యవస్థకు కేవలం కొనుగోలుదారుగానే ఉండకుండా సాంకేతిక బదిలీ ద్వారా దానిని స్థానికంగా తయారు చేయాలని అప్పుడు భారత్ భావించింది. రెండు దేశాల మధ్య బలపడుతున్న రక్షణ సంబంధాలలో ఇది ఓ మైలురాయి

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# ఆర్ఎస్ఎస్ హెడ్డాఫీస్ ముట్టడి

(మొదటిపేజీ తరువాయి)

ప్రతులను చేతిలో పట్టుకుని నినాదించారు. ఆర్ఎస్ఎస్ కార్యాలయం ఎదుట మనుస్మృతి పుస్తక ప్రతులను దహనం చేశారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలం పూర్తిగా దళితులకు వ్యతిరేకమని ఆరోపించారు. ఈ క్రమంలో పరిస్థితి అదుపు తప్పింది. పోలీసులు రంగంలోకి దిగి ఉదయ్ భానుచిబ్‌తో పాటు పలువురు కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు.

# 5న సీజేపీ మార్చ్‌ను ఆపలేం

(మొదటిపేజీ తరువాయి)

తెలిపింది. పిటిషనర్లు తమ విజ్ఞప్తులను కేంద్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు నియమించిన హైపవర్ కమిటీ ఎదుట ఉంచాలని సూచించింది. సీజేపీ నిర్వాహకులు ఈనెల 5న నిర్వహించనున్న ర్యాలీకి ఇప్పటివరకు అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నట్టు తనకు తెలియదని పిటిషనర్ తరపు న్యాయవాది రిజాన్ అహ్మద్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు జరగనున్న నేపథ్యంలో భద్రతా పరంగా ఆందోళనలు తలెత్తే అవకాశం ఉందని, అందువల్ల నిరసనను వాయిదా వేయాలని కోరారు. అయితే నిరసన సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరుగుతాయని ముందుగానే ఊహించడానికి ప్రస్తుత పరిస్థితుల్లో కారణం లేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు.

**విద్యార్థులపై కేసుల ఉపసంహరణకు సుప్రీంను ఆశ్రయించిన కేంద్రం**

పరీక్షా పత్రాల లీకేజీ ఆరోపణలపై జులైలో జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులు చేపట్టిన ఆందోళనలకు సంబంధించిన కేసులను ఉపసంహరించడంలో కేంద్రం విఫలమైందని విమర్శిస్తూ సీజేపీ ఈనెల 5న నిరసనకు పిలుపునిచ్చింది. ఇదే డిమాండ్‌తో గతంలో చేపట్టిన విద్యార్థుల ఆందోళనకు కొనసాగింపుగా తాజా నిరసనను ప్రకటించింది. ఇదిలా ఉండగా, విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించేందుకు కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు దాఖలు చేసిన దరఖాస్తును అత్యవసరంగా విచారించాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సోమవారం సుప్రీంకోర్టును కోరారు. అయితే ఈనెల 5న ఢిల్లీలో సీజేపీ తలపెట్టిన నిరసన ప్రదర్శనకు కొద్ది రోజుల ముందే ఈ పరిణామం చోటుచేసుకుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వద్ద తుషార్ మెహతా ఈ అంశాన్ని ప్రస్తావించారు. విద్యార్థుల నిరసనలకు సంబంధించిన కేసులను ఎత్తివేయడానికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద సుప్రీంకోర్టు అసాధారణ అధికారాలను వినియోగించాలని కేంద్రం కోరుతున్నట్టు తెలిపారు. దీనిపై సీజేపీ సానుకూలంగా స్పందిస్తూ, సమస్య పరిష్కారం దిశగా అన్ని పక్షాలు ముందుకు సాగుతున్నట్లయితే దరఖాస్తును పరిశీలనకు తమకు అభ్యంతరం లేదని పేర్కొన్నారు.

జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులు చేపట్టిన ఆందోళనను జులై 25న విరమించిన సమయంలో సీజేపీ పలు డిమాండ్లను ముందుకు తెచ్చింది. అందులో విద్యార్థులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవడం ప్రధాన డిమాండ్‌గా ఉంది. అయితే కేంద్రం ఈ హామీ అమలులో జాప్యం చేస్తోందని, ఈ నేపథ్యంలోనే ఈనెల 5న మరోసారి నిరసన చేపట్టనున్నట్టు సీజేపీ ప్రకటించింది. కాగా విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఎత్తివేసే విషయంలో ఆర్టికల్ 142ను వినియోగించేందుకు సుప్రీంకోర్టు ఆగస్టు 18నే సుముఖత వ్యక్తం చేసింది. ఈ కేసులు వేలాది మంది యువ విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొంది. అయితే హత్య, లైంగికదాడి, అపహరణ వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి ఈ వెసులుబాటు వర్తించదని స్పష్టం చేసింది.

**నిరసన ప్రదర్శనపై ఏ నిర్ణయం ప్రకటించని సీజేపీ**

కేంద్రం తాజాగా తీసుకున్న నిర్ణయం సీజేపీ ఈనెల 5న తలపెట్టిన మార్చ్ కు ప్రధాన కారణాల్లో ఒకటైన విద్యార్థులపై కేసుల ఎత్తివేత అంశాన్ని పరిష్కరించే దిశలో కీలక అడుగుగా భావిస్తున్నారు. అయితే కేంద్రం తాజా చర్య నేపథ్యంలో తమ నిరసనను విరమిస్తున్నట్టు లేదా మార్చుతున్నట్టు సీజేపీ ఇప్పటివరకు ప్రకటించలేదు. ఇదే సమయంలో 5న జరగనున్న నిరసనపై తక్షణ ఆంక్షలు విధించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది.

# పిజిఆర్ఎస్‌లో 59 ఫిర్యాదులు స్వీకరణ...!

**- ప్రతి ఫిర్యాదును నిష్పాక్షికంగా విచారించాలి**
**- బాధితులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యం**
**- నిర్ణీత గడువులో సమస్యలు పరిష్కరించాలి: జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు**



**తిరుపతి క్రైమ్ – సూర్య వాస్తవం :** ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., స్పష్టం చేశారు. తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ( పిజిఆర్ఎస్ ) కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 59 ఫిర్యాదులు స్వీకరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీలు ఏ. శ్రీనివాసులు (పరిపాలన), శ్రీలత (మహిళా పోలీస్ స్టేషన్) ఫిర్యాదులను స్వీకరించి బాధితుల సమస్యలను తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులు చట్ట పరిధిలో నిష్పాక్షికంగా విచారించి, నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. అర్హులైన బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం, నిర్లక్ష్యానికి తావులేదని అధికారులకు స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను సానుకూలంగా స్వీకరించి, చట్టపరమైన పరిధిలో వేగంగా పరిష్కరించడం ద్వారా పోలీస్ శాఖపై ప్రజల్లో మరింత విశ్వాసాన్ని పెంపొందించడమే లక్ష్యమని ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు పేర్కొన్నారు.

# ఇక దూసుకుపోవడమే!

(మొదటిపేజీ తరువాయి)

తలపై చల్లుకుని తనతో ఉన్న మంత్రులు, ప్రజాప్రతినిధులు, రైతుల తలలపైనా చల్లారు.

ఎమ్మెల్యేల నృత్యం

అదేసమయంలో అక్కడున్న మార్కాపురం జిల్లా ప్రాంత ఎమ్మెల్యేలు ఆనందంతో డ్యాన్స్ వేయగా మిగిలిన వారు వారికి జత కలిశారు. తొలుత కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి నృత్యం చేయగా పక్కనే ఉన్న మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య జతకలిశారు. సీఎం వద్ద ఉన్న నారాయణరెడ్డి, ఎరిక్షన్‌బాబు, అశోక్‌రెడ్డిలు కూడా వచ్చి కలిశారు. పరవశంతో వారు చేస్తున్న నృత్యాన్ని చూసి అక్కడే ఉన్న ఇతర నాయకులు, ఎమ్మెల్యేలు కూడా అభినందించారు.

**సభికులతో బాబు**

సభావేదికలో చంద్రబాబు ప్రసంగానికే పరిమితం కాకుండా సభకు వచ్చిన వారితో కలిసి ఆనందం పంచుకునేందుకు ప్రాధాన్యమిచ్చారు. వేదిక మధ్యలో ఏర్పాటు చేసిన రన్‌వేపై రెండుసార్లు కలియతిరిగి అందరికీ అభివాదం చేశారు. పసుపుపచ్చ టవళ్లు ఊపుతూ సభికులు కేరింతలు కొడుతుంటే ఆయన కూడా ఒక టవల్ తీసుకుని ఊపుతూ వారిని మరింత ఉత్సాహపరిచారు.

**జిల్లా నేతలకు ప్రాధాన్యం**

కార్యక్రమం ఆరంభం నుంచి చివరివరకు మార్కాపురం జిల్లా నేతలను, ఒంగోలు ఎంపీ మాగుంటను సీఎం చంద్రబాబు పక్కనే ఉంచుకున్నారు. నీటి విడుదల సమయంలో పక్కనే ఎరిక్షన్‌బాబు ఉండగా దూరంగా ఉన్న మార్కాపురం ఎమ్మెల్యే నారాయణరెడ్డిని పిలిచి రెండో గేటు తెరిచే బటన్ నొక్కించారు. సభలో కూడా తొలుత నారాయణరెడ్డి, ఉగ్ర, అశోక్‌రెడ్డి, ఎరిక్షన్‌బాబు, ఎంపీ మాగుంటలకే మాట్లాడే అవకాశం ఇచ్చారు. వీరితోపాటు ప్రాజెక్టు నిర్మాణపనులలో కీలకంగా వ్యవహరించిన మంత్రి నిమ్మల రామానాయుడును ప్రత్యేకంగా ప్రశంసించారు.

**వైపాలెం, మార్కాపురం ప్రాంతాల్లో కదిలిన జనం**

సభా ప్రాంగణానికి మార్కాపురం జిల్లాలోని వారే హాజరవడం కనిపించింది. అందులోనూ ప్రధానంగా వైపాలెం, మార్కాపురం నియోజకవర్గాల వారే అధికంగా వచ్చారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో దోర్నాల, అలాగే ఇటు మార్కాపురం ప్రాంతంలో ఊరూవాడా కదిలి వచ్చారంటే అతిశయోక్తి కాదు. కార్యక్రమ నిర్వహణలో కీలకపాత్ర కూడా ఇటు నారాయణరెడ్డి అటు ఎరిక్షన్‌బాబులే నిర్వహించారు. వారికి చేదోడుగా ఉగ్ర, అశోక్‌రెడ్డి నిలవగా మంత్రి రామానాయుడుతో పాటు గొట్టిపాటి రవికుమార్, స్వామి చివరి రెండు రోజుల్లో నారాయణ, సత్యప్రసాద్‌లు కార్యక్రమాల పర్యవేక్షణలో కీలక బాధ్యతలు పోషించారు.

**మాగుంట దూకుడు ప్రసంగం**

గత 30 సంవత్సరాలలో ఎప్పుడూలేని విధంగా ఈ సభలో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి తన ప్రసంగంలో దూకుడును ప్రదర్శించారు. వెలిగొండ, మార్కాపురం జిల్లా విషయంలో మాట నిలుపుకున్న చంద్రబాబునాయుడును కొనియాడుతూ గత ప్రభుత్వంలో ప్రాజెక్టును జాతికి అంకితం చేసినట్లు అప్పటి ముఖ్యమంత్రి మోసం చేశాడంటూ కులం, మతం ఆధారంగా నాయకులను నమ్మవద్దంటూ ప్రజలను హెచ్చరించారు. పైగా అప్పుడు తామెన్ని చెప్పినా వినని మూర్ఖుడు వాడు అంటూ పరోక్షంగా జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ప్రత్యర్థుల విషయంలో మాగుంట ఇలాంటి పదజాలం వాడటం ఇదే తొలిసారి.

**ప్రత్యేక హెలికాప్టర్‌లో ఎంపీ రాక**

పట్టణ వ్యవహారాల పార్లమెంట్ కమిటీ చైర్మన్‌గా ఉన్న మాగుంట ముందుగా నిర్ణయించిన ప్రకారం సోమవారం చెన్నైలో జరిగే ఆ కమిటీ సమావేశంలో పాల్గొనాల్సి ఉంది.

ఆ సమావేశానికి తమిళనాడు ముఖ్యమంత్రి కూడా హాజరుకానున్నారు. దీంతో చంద్రబాబు అనుమతితో ఈ కార్యక్రమానికి గైర్హాజరు కావాలని అనుకోగా చంద్రబాబు మాత్రం తప్పక హాజరుకావాలని ఆదేశించారు. దీంతో చెన్నై నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో పదిన్నర గంటల ప్రాంతంలో వెలిగొండ ప్రాజెక్టు వద్దకు మాగుంట చేరారు. తిరిగి సభాకార్యక్రమం పూర్తికాగానే హెలికాప్టర్‌లో వెళ్లి చెన్నైలో కార్యక్రమానికి హాజరయ్యారు.

## అంతర్జాతీయవిద్య కోసం
# ప్రత్యేక టాస్క్‌ఫోర్స్

(మొదటిపేజీ తరువాయి)

పోస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ‘తెలంగాణ రైజింగ్’ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఇటీవల బ్రిటన్, అమెరికా దేశాల్లో పర్యటించేందుకు వెళ్లిన విషయం తెలిసిందే. అయితే కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి అనుమతి ఇవ్వకపోవడంతో సీఎం లండన్ పర్యటన ముగించుకొని హైదరాబాద్‌కు తిరిగి వచ్చేశారు. కానీ తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం తమ పర్యటనను కొనసాగించింది. ఈనేపథ్యంలో సోమవారం ఆ బృందం సీఎం రేవంత్‌రెడ్డికి పర్యటన పూర్తి నివేదికను అందచేసింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఈ విదేశీ పర్యటన, అంతర్జాతీయ వర్సిటీల భాగస్వామ్యం తెలంగాణ యువతరం భవిష్యత్‌కు ఊపిరి పోస్తుందని చెప్పారు. హైదరాబాద్‌ను దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ‘గ్లోబల్ నాలెడ్జ్ హబ్’గా తీర్చిదిద్దేందుకు ఈ పర్యటన ఉపయోగపడిందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం విదేశీ పర్యటనలో సాధించిన చారిత్రాత్మక పురోగతి, ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థలతో కుదిరిన కీలక ఒప్పందాలు, అవగాహనా ఒప్పందాలు (ఎమ్ఓయూలు), లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్ఓఐ)ల సమగ్ర వివరాలతో కూడిన ప్రత్యేక నివేదికను అందచేసింది. ఐటీ, పరిశ్రమలు, ఫార్మా, లైఫ్ సైన్సెస్, పరిశోధన, డిఫెన్స్ రంగాల్లో రాష్ట్రాన్ని అంతర్జాతీయ విద్యా, నైపుణ్య రంగానికి ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యమని కమిటీ తన నివేదికలో పేర్కొంది.

అమెరికాలోని అత్యుత్తమ ‘నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ’తో పాటు బ్రిటన్‌లోని 17 స్వతంత్ర విద్యాసంస్థల సమాఖ్య అయిన ‘యూనివర్సిటీ ఆఫ్ లండన్’ భారత్‌లోనే తమ తొలి ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు స్పష్టమైన అంగీకారం తెలిపాయని నివేదికలో స్పష్టంచేశారు. నార్త్ ఈస్టర్న్ వర్సిటీ తమ క్యాంపస్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ‘భారత్ ఫ్యూచర్ సిటీ’లో ఏర్పాటు చేసే అవకాశాలను ముమ్మరంగా పరిశీలిస్తున్నదనీ, ‘హార్వర్డ్ యూనివర్సిటీ’ హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎమ్‌సీహెచ్చార్డీ) వేదికగా ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, కార్పొరేట్ రంగ ప్రతినిధుల కోసం ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కోర్సులను నిర్వహించేందుకు అంగీకరించినట్టు తెలిపారు. ఈ అంతర్జాతీయ కోర్సులు ఈ ఏడాది నవంబర్ నుంచి ప్రత్యక్షంగా ప్రారంభమవుతాయని వివరించారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, లండన్ బిజినెస్ స్కూల్, వర్జీనియా టెక్, ఇంపీరియల్ కాలేజ్ లండన్ వంటి దిగ్గజ విద్యాసంస్థల అధిపతులతో తెలంగాన రైజింగ్ ప్రతినిధి బృందం విస్తృత స్థాయి చర్చలు జరిపినట్టు నివేదికలో పేర్కొన్నారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీతో సంయుక్త పరిశోధనా కేంద్రాలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ఏర్పాటుపై సుదీర్ఘంగా చర్చించామనీ, ఆయా సంస్థల నిపుణుల బృందాలు త్వరలోనే హైదరాబాద్‌లో పర్యటించి ప్రత్యక్షంగా ఇక్కడి వసతులను పరిశీలిస్తాయని తెలిపారు. నర్సరీ నుంచి ఉన్నత విద్య వరకు, ఐటీఐలు, పాలిటెక్నిక్ కాలేజీలు, స్కిల్స్ యూనివర్సిటీల ద్వారా యువతలో నైపుణ్యాలను పెంపొందించడం, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వంటి వాటి ద్వారా విద్యా వ్యవస్థను సమూలంగా మార్చడమే ప్రభుత్వ ఉద్దేశమని నివేదిక స్పష్టం చేసింది. ఈ సందర్భంగా ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు మాట్లాడుతూ హైదరాబాద్‌లో అంతర్జాతీయ విద్యా కేంద్రం (గ్లోబల్ నాలెడ్జ్ హబ్) ఏర్పాటైతే, మరిన్ని ప్రపంచ స్థాయి మల్టీనేషనల్ కంపెనీలు, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు (జీసీసీ) తెలంగాణకు తరలివస్తాయని చెప్పారు. దీనివల్ల యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయనీ, తయారీ, పరిశోధన రంగాలు వేగంగా వృద్ధి చెందుతాయని వివరించారు తెలిపారు.

కార్యక్రమంలో ఎమ్‌సీహెచ్చార్డీ వైస్ చైర్‌పర్సన్ శాంతకుమారి, సీఎం సలహాదారు కే రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ప్రభుత్వం నిర్వహించనున్న ‘ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్’లో ప్రపంచ విద్యాసంస్థల భాగస్వామ్యం, క్రీడా రంగ అభివృద్ధిపై ప్రత్యేక కార్యక్రమాన్ని (ట్రాక్) నిర్వహిస్తామని తెలిపారు.

# కొనుగోలుదారుగానే మిగిలింది !

(మొదటిపేజీ తరువాయి)

అంటూ ప్రభుత్వ అనుకూల మీడియా కథనాలను వండివారుస్తోంది. అయితే ఈ ఒప్పందం వెనుక ఆశాజనకంగా లేని ఓ వాస్తవం దాగి ఉంది.

**సమాధానాల కంటే ప్రశ్నలే అధికం**

జావెలిన్ క్షిపణుల కోసం 16 సంవత్సరాల పాటు చర్చలు జరిపిన తర్వాత కూడా భారత్ సాధించింది ఏమిటన్న ప్రశ్న తలెత్తుతోంది. దేశీయంగా క్షిపణుల తయారీకి చేసిన ప్రయత్నాలు విఫలమైనప్పుడు జావెలిన్ సహ–ఉత్పత్తిపై అమెరికా ఇచ్చిన తాజా హామీని ఎలా విశ్వసించాలన్న సందేహం కలుగుతోంది. జావెలిన్ సాంకేతికతపై అమెరికా తన నియంత్రణను నిలుపుకొని, భారత్ కేవలం ఆ క్షిపణి కొనుగోలుదారుగా మాత్రమే మిగిలిపోతే ‘సహ–ఉత్పత్తి’ అనే మాటకు అర్థం ఏముంటుంది? పైగా ఏటీజీఎం కొనుగోలుకు సంబంధించిన పరిస్థితులు కూడా పెద్దగా భరోసా ఇవ్వడం లేదు. ఒప్పందం విలువ, దాని వివరాలు బహిర్గతం కాలేదు. భారత త్రివిధ దళాలు ఒకేసారి రూ.300 కోట్ల విలువైన ‘కీలక కార్యాచరణ సామర్థ్యాల’ను నేరుగా సమకూర్చుకోవడానికి ఈ ఒప్పందం వీలు కల్పిస్తుందని కొన్ని వర్గాలు చెబుతున్నాయి. జావెలిన్ కోసం సుదీర్ఘ కాలం జరిగిన చర్చలు చివరికి ఓ ఫాస్ట్‌ట్రాక్ రెడీమేడ్ కొనుగోలుతో ఎలా ముగిశాయి ? ఒక్క మాటలో చెప్పాలంటే జావెలిన్ ఒప్పందం సమాధానాలు ఇవ్వడం కంటే ఎక్కువ ప్రశ్నలను లేవనెత్తుతోంది. అందుబాటులో ఉన్న ఒప్పందం వివరాలు కూడా చాలా అస్పష్టంగా ఉన్నాయి.

**ఆధునిక సామర్థ్యాల కోసం ప్రయత్నాలు**

జావెలిన్‌లో రెండు సామర్థ్యాలు ఉన్నాయి. ఒకటి ‘ఫైర్ అండ్ ఫర్‌గెట్’ సామర్థ్యం. అంటే కాల్పులు జరిపిన వెంటనే దాని ఆపరేటర్లు అక్కడి నుంచి వెళ్లిపోయేందుకు వీలు కలుగుతుంది. రెండోది టాప్–అటాక్ సామర్థ్యం. ట్యాంకుల రక్షణ కవచం బలహీనంగా ఉన్నప్పుడు పై నుంచి వాటిపై దాడి చేయడానికి వీలు కల్పిస్తుంది. భారత సైన్యం ఆధునిక మూడో తరం ఏటీజీఎం కోసం 1990వ దశకం చివర, 2000వ దశకం ప్రారంభం నుంచే అన్వేషించడం ప్రారంభించింది.

అయితే ఆ సమయంలో అందుబాటులో ఉన్న వ్యవస్థలలో ఈ ఆధునిక సామర్థ్యాలు లేవు. జావెలిన్‌లో ఈ వ్యవస్థలు ఉండడంతో మన దేశం వాటి కోసం ప్రయత్నాలు ప్రారంభించింది.

ఈ సంవత్సరం మేలో సింగపూర్‌లో జరిగిన చర్చల సందర్భంగా అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సేథ్ జావెలిన్ వ్యవస్థ అమ్మకాన్ని ప్రస్తావించారు. ఏదేమైనా ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఇరు పక్షాలకు భిన్నమైన ప్రాధాన్యతలు ఉన్నాయి.

**అమెరికా చేతిలోనే నియంత్రణ**

న్యూఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం గత నెల 28న ఒప్పందం వివరాలను ప్రకటించింది. దీని ప్రకారం సాంకేతిక పరిజ్ఞానంపై యాజమాన్యం, ఏటీజీఎం సరఫరాపై నియంత్రణ అమెరికా చేతిలోనే ఉంటుంది. ఏటీజీఎం ఉత్పత్తిదా రుగా మారాలన్న భారత్ ఆకాంక్ష నెరవేరలేదు. చివరికి కొనుగో లుదారు పాత్రకే అది పరిమితం కావాల్సి వచ్చింది. పరస్పర ప్రయోజనకరంగా జావెలిన్ క్షిపణులను రెండు దేశాలు ఉత్పత్తి చేసే అంశం పైన, తయారీ–సాంకేతిక పరిజ్ఞా నం విస్తరణ అవకాశాల పైన తాజాగా కుదిరిన ఒప్పంద పత్రం (ఏల్ఓఏ) చర్చలకు వీలు కల్పిస్తుందని అమెరికా రాయబార కార్యాలయం చెప్పినప్పటికీ మరింత వివరణ ఇచ్చేందుకు నిరాకరించింది.

**పరీక్ష అవసరమా?**

గత సంవత్సరం నవంబరులో అమెరికా విదేశాంగ శాఖ 45.7 మిలియన్ డాలర్ల విలువైన ఎఫ్ఎంఎస్ ప్యాకేజీకి ఆమోదం తెలిపింది. ఇందులో 100 జావెలిన్ క్షిపణులు, పాతిక తేలికపాటి కమాండ్ లాంఛ్ యూనిట్లు, ఓ అదనపు క్షిపణి ఉన్నాయి. ఆయుధ వ్యవస్థను కొనుగోలు చేయడానికి ముందు వినియోగదారుడు ఈ అదనపు క్షిపణిని ప్రయోగించాల్సి ఉంటుంది. పదహారు సంవత్సరాల చర్చల తర్వాత కూడా వ్యవస్థ కొనుగోలుకు ముందు క్షిపణిని భారత్ ప్రయోగించాలని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. ఇంతకాలం తర్వాత భారత సైన్యానికి జావెలిన్‌ను పరీక్షించడం ఇంకా అవసరమా అని ఓ నిపుణుడు వ్యంగ్యంగా ప్రశ్నించారు. దీనిని ఓ విచిత్రమైన చిక్కుముడిగా పలువురు సైనిక విశ్లేషకులు చూస్తున్నారు.

# సంపాదకీయం

## ఒకే ప్రపంచం.. ఒకే మానవత్వం

అమెరికా పర్యటనలో ఉన్న ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కీలక వ్యాఖ్యలు చేశారు. న్యూయార్క్‌లో జరిగిన మల్టీ-ఫెయిత్ డైలాగ్‌లో హిందూ- ముస్లిం సంబంధాలు, హిందుత్వ భావనపై ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. భారత్‌లో ముస్లింలు ఉండకూడదని ఏ హిందువు భావించినా.. అతను హిందువుగా మిగలడంటూ పేర్కొన్నారు.. అమెరికాలోని న్యూయార్క్‌లో గల ప్రతిష్టాత్మక మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో 'అమెరికన్ హిందూస్ ఫర్ ఎంగేజ్‌మెంట్ అండ్ డైలాగ్' ఆధ్వర్యంలో ఆగస్టు 29న విశ్వ ఏకత్వ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సర్సంఘచాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ కీలక ప్రసంగం చేశారు.నం అమెరికా గురించి మాట్లాడేటప్పుడు 'బహుళత్వం అనే పదాన్ని ఎక్కువగా వింటాం. కానీ, భారత్ గురించి చర్చించేటప్పుడు 'భిన్నత్వంలో ఏకత్వం' అనే పదం గుర్తుకువస్తుంది. భారత్‌ను ఒక భౌగోళిక ప్రాంతంగా మాత్రమే చూడలేం. ఈ భిన్నత్వం, ఐక్యత రెండూ భారతీయ డిఎన్ఏలోనే భాగమయ్యాయి. ఈ విశ్వంలో ప్రతి దేశానికి ఒక ప్రత్యేకమైన లక్ష్యముంటుంది" అని పేర్కొన్నారు.స్వామి వివేకానంద మాటలను గుర్తుచేస్తూ.. జగత్తుకు ఐక్యతా సందేశాన్ని అందించడం, ఆ సూత్రాన్ని ప్రపంచానికి చాటిచెప్పడమే భారత్ అసలు లక్ష్యమని ఆయన అన్నారు. "మనమంతా ఒక్కటే. వైవిధ్యం అనేది మన ఏకత్వానికి ఒక అలంకారం వంటిది. అందుకే వైవిధ్యాన్ని గౌరవించాలి, అంగీకరించాలి, జరుపుకోవాలి" అని పిలుపునిచ్చారు.రాక్షస ప్రవృత్తిమా మాట వింటేనే రక్షణ కల్పిస్తాం" అని షరతులు విధించే ధోరణి. సంస్కృతంలో రక్షణను 'రక్ష' అంటారు. తమను లొంగదీసుకునే వారిని మాత్రమే రక్షించేవారు రాక్షసులు.ధర్మం అభిప్రాయాలు, ఉపయోగాలతో సంబంధం లేకుండా అందరినీ మానవులుగా చూస్తూ, సోదరభావంతో మెలగడమే నిజమైన మానవత్వం.అంతర్గతంగా ఉన్న ఏకత్వ భావనే ధర్మమని, అది అందరినీ ఏకం చేస్తుందే తప్ప విడదీయదని మోహన్ భగవత్ అన్నారు.ప్రకృతి మరియు సమాజం పట్ల మన బాధ్యతలను గుర్తుచేస్తూ.. "మనం తినే ఆహారం రైతుల శ్రమ వల్ల, వేసుకునే బట్టలు కార్మికుల కష్టం వల్ల వస్తున్నాయి. సమాజంలో ప్రతి ఒక్కరికీ మనం రుణపడి ఉన్నాం. అందుకే తిరిగి సమాజానికి సేవ చేయడం మన బాధ్యత" అని చెప్పారు. ప్రపంచంలో స్థిరపడిన భారతీయులు తమ కర్మభూమి పట్ల విధేయతతో ఉంటూనే, జన్మభూమి విలువలను పాటించాలని ఆకాంక్షించారు.మోహన్ భాగవత్ ప్రసంగానికి ముందు, ప్రపంచవ్యాప్తంగా 30 దేశాల నుండి విచ్చేసిన 180 మంది మత నాయకులు ఒక ప్రతిజ్ఞను స్వీకరించారు. 'వన్ వరల్డ్ ? వన్ హ్యూమానిటీ' (ఒకే ప్రపంచం ? ఒకే మానవత్వం) పేరిట 5 సూత్రాల కార్యాచరణ ప్రణాళికను ప్రకటించారు. మతం పేరుతో ద్వేషం, హింసను ప్రేరేపించడాన్ని ప్రపంచ మత నాయకులు ముక్తకంఠంతో ఖండించారు. అంతర్జాతీయ సదస్సులో 39 రాష్ట్రాలు, 850 అమెరికన్ నగరాలు, 29 దేశాలకు చెందిన దాదాపు 6,000 మంది ప్రతినిధులు, 250 ఆధ్యాత్మిక-సామాజిక సంస్థలు భాగస్వామ్యమయ్యాయి. భాగవత్ అన్నారుకొంతమంది ముస్లింలు నాతో మాట్లాడుతూ ఆరెస్సెస్ అంటున్న హిందూ దేశం అంటే ఏంటి? ముస్లింలను దేశం నుంచి తరిమేయడమేనా అని అడిగారు. దానికి నేను 'అలా చేయడం హిందూత్వ కాదు. భారత్‌లో ముస్లింలు ఉండకూడదని ఎవరైనా హిందువు భావిస్తే అతను హిందువు కాదని చెప్పాను" అని ఆయన వివరించారు."మనం యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా అని చెప్పినప్పుడు అందరికీ బహుళత్వం గుర్తుకొస్తుంది. అలాగే భారత్ అని చెప్పినప్పుడు భిన్నత్వంలో ఏకత్వం గుర్తుకొస్తుంది" అని భాగవత్ తన ప్రసంగంలో చెప్పారు.అన్ని మతాలు అంతిమంగా దైవాన్వేషణకే దారితీస్తాయని హిందూ సంప్రదాయం చెబుతోందని భాగవత్ అన్నారు. ఇతరచోట్ల రక్షణ లభించని వివిధ మతాల ప్రజలకు భారతదేశం ఎప్పటి నుంచో ఆశ్రయం కల్పిస్తోందని ఆయన చెప్పారు.అయితే, వర్గాల మధ్య ఉద్రిక్తతలు ఏర్పడటంలో గతం'వారసత్వం' పాత్ర పోషించిందని ఆయన అన్నారు.భిన్నత్వం ఉన్నప్పటికీ అందరిలో ఒక మౌలికమైన ఐక్యత ఉందనే భావనను సమాజానికి తెలియజేయడం ఆర్‌ఎస్‌ఎస్ బాధ్యత అని ఆయన అన్నారు."మనం విధానాలను ప్రభావితం చేయాలనుకుంటున్నాం. యుద్ధాలను ఆపాలనుకుంటున్నాం. అందుకే మనం రాజకీయాలను ప్రభావితం చేయాలనుకుంటున్నాం. కానీ మనం రాజకీయాలు చేయలేం. రాజకీయాలు స్వార్థపు ఆటగా మారాయి. 'నేను నాది' ఉన్నచోట పరిష్కారం లేదు. 'మనం మనది' అనుకుంటేనే పరిష్కారం సాధ్యం" అని భాగవత్ చెప్పారు. హరియాణా గగనతలంపై 1996లో సౌదీ ఎయిర్‌లైన్స్ విమానం, కజకిస్తాన్ ఎయిర్‌లైన్స్ విమానం ఢీకొన్న ఘటనను భాగవత్ గుర్తుచేసుకున్నారు. ఆ ప్రమాద స్థలానికి మొదటగా చేరుకున్న వారిలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు కూడా ఉన్నారని, గాయపడిన వారికి వారు సాయం చేశారని చెప్పారు." అతను ముస్లిం అని మేం అనుకోలేదు. మేం రాజకీయాల్లో ఉండిఉంటే, బహుశా ఇది చేయలేకపోయేవాళ్లం" అని ఆయన అన్నారు."తప్పుడు కథనాల వల్ల అపోహలు ఏర్పడతాయి. కానీ మీరు మా మధ్యకు వచ్చి మమ్మల్ని దగ్గరగా చూస్తే, ఈ అపోహలన్నీ ఒక్క రోజులోనే తొలగిపోతాయి" అని భాగవత్ చెప్పారు.ఈ సమావేశానికి నైజీరియాలోని ప్రముఖ క్యాథలిక్ మతగురువు 1994 నుండి 2019 వరకు అబుజా ఆర్చ్‌బిషప్‌గా పనిచేసిన కార్డినల్ జాన్ ఒలోరున్‌ఫెమి ఒనైయెకాన్ కూడా హాజరయ్యారు.గతపు 'వారసత్వం' గురించి ప్రస్తావించిన ఒనైయెకాన్, ఆఫ్రికాలో మతపరమైన సంఘర్షణలకు గల కారణాలలో ఒకటి మతమార్పిడి, ఆధిపత్యం కోసం ఇస్లాం - క్రైస్తవ మతాల మధ్య జరిగిన చారిత్రక పోటీ అని అన్నారు.మనం గత వారసత్వాన్ని మోస్తున్నాము. దానిని వదిలేయాలి" అని ఆయన చెప్పారు.ఆఫ్రికాలో రెండు మతాలు విస్తరిస్తున్నప్పుడు తన కుటుంబంలో కొందరు క్రైస్తవులుగా మరికొందరు ముస్లింలుగా మారారని ఆయన గుర్తుచేశారు."మతమార్పిడి, ఆధిపత్యం కోసం ఇస్లాం, క్రైస్తవ మతాలు ఆఫ్రికాలోకి పోటీగా వచ్చాయి. ఆ వైరం ఇంకా ముగియలేదు" ఒనైయెకాన్ అన్నారు.

# కార్పొరేట్‌కు ధీటుగా కేజీబీవీ పాఠశాలలు...!

- గార్లదిన్నె కేజీబీవీలో ఎస్టీ కమిషన్ సభ్యుడు పి.వెంకటప్ప ఆకస్మిక తనిఖీ
- విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన సౌకర్యాలు కల్పించాలి
- చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రోత్సాహం ఇవ్వాలి



**అనంతపురం - సూర్య వాస్తవం :** ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న బాలికలకు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మెరుగైన విద్యా వాతావరణం, సౌకర్యాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు పి. వెంకటప్ప సూచించారు. అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందిస్తున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని పాఠశాల సిబ్బందికి సూచించారు.

**విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి**

విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని వెంకటప్ప సూచించారు. బాలికల ఆరో గ్యం, వ్యక్తిగత పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

చదువుతో పాటు క్రీడలు, సాంస్కృ తిక కార్యక్రమాలు, ఇతర నైపుణ్యా ల్లోనూ విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే విధంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు.

**అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సాహం**

కేజీబీవీలో చదువుతున్న బాలికలకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించి, వారు అన్ని రంగాల్లో ముందుకు సాగేలా అవసరమైన ప్రోత్సాహం, మార్గదర్శకత్వం అందించాలని ఎస్టీ కమిషన్ సభ్యులు పి. వెంకటప్ప తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి సమాజంలో మంచి స్థానాన్ని సంపాదించుకునేలా పాఠశాల అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని ఆయన కోరారు.

# గ్రామీణ ప్రాంతాలకు బ్యాంకింగ్ సేవలు మరింత చేరువ కావాలి...!

- డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశంలో పాల్గొన్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశంలో బ్యాంకు అధికారులకు పలు సూచనలు




**అనంతపురం కలెక్టరేట్ -- సూర్య వాస్తవం:** అనంతపురం జిల్లా కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సోమవారం గౌరవ జాయింట్ కలెక్టర్ శ్రీ విష్ణు చరణ్ అధ్యక్షతన జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ), జిల్లా స్థాయి సమీక్షా కమిటీ (డీఎల్ఆర్‌సీ) సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లాలో బ్యాంకింగ్ సేవల విస్తరణ, రైతులు, యువత, గ్రామీణ ప్రజలకు మెరుగైన ఆర్థిక సేవలు అందించడంపై బ్యాంకు అధికారులు, నాబార్డ్, ఆర్‌బీఐ ప్రతినిధులతో చర్చించారు.

**మూడు మండలాల్లో బ్యాంకు శాఖల ఏర్పాటుకు ప్రతిపాదన**

గోవిందవాడ, బొమ్మనహాల్, సెట్టూరు మండలాల్లో ప్రజలకు బ్యాంకింగ్ సేవలు మరింత అందుబాటులోకి తీసుకురావడానికి యూనియన్ బ్యాంక్ లేదా ఇతర బ్యాంకుల శాఖలను ఏర్పాటు చేయాలని సమావేశంలో ప్రతిపాదించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు బ్యాంకింగ్ సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**ఉద్యానవన రైతులకు వడ్డీ రాయితీ కల్పించాలి**

ధరల పతనం, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా నష్టాలను ఎదుర్కొంటున్న ఉద్యానవన రైతులకు రుణాలపై వడ్డీ రాయితీ కల్పించే అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. రైతులకు ఆర్థికంగా అండగా నిలిచేలా బ్యాంకులు, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

**యువతకు మరింత ప్రోత్సాహం**

రూడ్‌సెటి ద్వారా శిక్షణ పొందిన యువత తమ నైపుణ్యాలను ఉపాధి, స్వయం ఉపాధి రంగాల్లో వినియోగించుకునేలా మరింత ప్రోత్సాహం అందించాలని సమావేశంలో కోరారు. శిక్షణ అనంతరం యువతకు అవసరమైన బ్యాంకు రుణాలు, ఇతర ఆర్థిక సహకారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**నాబార్డ్ కార్యక్రమాల ప్రయోజనం జిల్లాకు అందాలి**

నాబార్డ్ ద్వారా జిల్లాలో అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల పూర్తి ప్రయోజనం ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

**మార్కెట్ యార్డులో కమ్యూనిటీ షెడ్**

అనంతపురం నియోజకవర్గంలోని మార్కెట్ యార్డులో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కమ్యూనిటీ షెడ్ ఏర్పాటు చేయాలని సమావేశంలో ప్రతిపాదించారు. రైతు లు, పశుపోషకులకు ఉపయోగపడే మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరచాల్సిన అవసరముందన్నారు.

**బ్యాంకింగ్ సేవలు సులభతరం చేయాలి**

బ్యాంకులు తమ ఖాతాదారులకు అందించే అన్ని రకాల సేవలు సులభంగా, సమర్థవంతంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌బీఐ అధికారులు సూచించారు. ప్రజలకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పించడంతో పాటు సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు సురక్షిత తాగునీరు**

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో బ్యాంకుల కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులను వినియోగించాలని కోరారు. ముఖ్యంగా ఫ్లోరైడ్ సమస్య ఉన్న ప్రాంతాల్లో ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించేందుకు బ్యాంకులు తమ సామాజిక బాధ్యత నిధుల ద్వారా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ప్రజలకు బ్యాంకులు అందిస్తున్న సేవలు ఎంతో కీలకమైనవని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి బ్యాంకులు మరింత చురుకైన పాత్ర పోషించాలని సమావేశంలో సూచించారు.ఈ సమావేశంలో వివిధ బ్యాంకులకు చెందిన ప్రాంతీయ మేనేజర్లు, శాఖల మేనేజర్లు, సంబంధిత శాఖల అధికారులు, నాబార్డ్, ఆర్‌బీఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

# గురువుకు ప్రతిరూపం ఉపాధ్యాయుడు చిన్నోడు

- పండుగ వాతావరణంలో పదవీ విరమణ
- ఉపాధ్యాయునీల కంట ఆనంద భాష్పాలు
- పదవీ విరమణ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ , ఆర్‌డిటి ప్రోగ్రాం డైరెక్టర్ దంపతులు



**శ్రీ సత్య సాయి బ్యూరో - సూర్య వాస్తవం :** గురువుకు ప్రతిరూపంగా శ్రీ సత్య సాయి జిల్లా కదిరి నియోజకవర్గం నంబులపూల కుంట మండలం గూటిబైలు హైస్కూల్లో విధులు నిర్వహిస్తున్న చిన్నోడు నిలుస్తాడని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆర్ డి టి ప్రోగ్రాం డైరెక్టర్ మాంచు దంపతులు కొనియాడారు. నంబులపూల కుంట మండలం గూటిబైలు హై స్కూలులో ఉపా ధ్యాయుడుగా చిన్నోడు పదవి విరమణ కార్యక్రమం హై స్కూలులో సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆర్ డి టి ప్రోగ్రాం డైరెక్టర్ మాంచు ఫెర్రర్ దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఉపాధ్యాయుడు చిన్నోడు నంబులపూల కుంట ప్రాంతంలో చాలా సంవత్సరాలుగా విధులు నివర్తిస్తున్నారని పేర్కొన్నారు అయితే ఆయన విధి నిర్వహణలో ఎక్కడ కూడా నిర్లక్ష్యం లేకుండా విద్యార్థిని విద్యార్థులకు బాగోగుల కోసం నిత్యం పరితపించే వ్యక్తి అని కొనియాడారు. విద్యార్థిని విద్యార్థుల అభివృద్ధి కోసం నిత్యం ఆలోచిస్తూ వారికి అండగా ఉన్న ఇలాంటి ఉపాధ్యాయుడి సేవలు చాలా ఉపయోగకరమని అన్నారు. ఉపాధ్యాయుడు చిన్నోడు పదవీ విరమణ చేస్తున్నారంటే తోటి ఉపాధ్యాయులు కూడా ఆనంద భాష్పాలు వెలిబుచ్చారు. విద్యార్థిని విద్యార్థులు తమకు తోచిన విధంగా బహుమతులు ఇచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు మరికొందరు విద్యార్థినిలు గురువుకు ఇచ్చే గౌరవం ప్రకారం నృత్యం ద్వారా తమ అభిమానాన్ని ప్రదర్శించారు. ఉపాధ్యాయుడు చిన్నోడు పదవి విరమణ కార్యక్రమానికి గూటిపైలు పరిసర ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శాంతమ్మ ఎంఈఓ లు గోపాల్ నాయక్ చిన్నికృష్ణ తిరుపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# చైల్డ్ సేఫ్టీపై విద్యార్థులకు అవగాహన...!

### - సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
### బెట్టింగ్ యాప్స్, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి: ఎస్సై పి.వై. ఆంజనేయులు



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** బుక్కరాయసముద్రం మండలంలోని దయ్యాల కుంటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చైల్డ్ సేఫ్టీ, సైబర్ నేరాలు, సోషల్ మీడియా వినియోగం, ఆన్‌లైన్ మోసాలు, బెట్టింగ్ యాప్స్, డ్రగ్స్ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిఎంఎస్కే సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బుక్కరాయసముద్రం ఎస్సై పి.వై. ఆంజనేయులు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. చదువుతో పాటు మంచి ప్రవర్తనను అలవర్చుకుని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్సై సూచించారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, ఆన్‌లైన్ మోసాలు, బెట్టింగ్ యాప్స్, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని తెలిపారు. ఎలాంటి సమస్య ఎదురైనా భయపడకుండా ధైర్యంగా ఎదుర్కొని, వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు. అత్యవసర పోలీస్ సేవలకు 100/112, సైబర్ నేరాల ఫిర్యాదులకు 1930, బాలల రక్షణ కోసం 1098 నంబర్లను వినియోగించుకోవాలని విద్యార్థులకు వివరించారు. అప్రమత్తతతోనే సైబర్ నేరాలను అరికట్టవచ్చని, మంచి అలవాట్లు బంగారు భవిష్యత్తుకు పునాది అని ఎస్సై పేర్కొన్నారు

# విడపనకల్లు అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో 'స్మార్ట్' నిఘా...!

### - నాలుగు అత్యాధునిక ఆటోమేటిక్ - నంబర్ ప్లేట్ గుర్తింపు కెమెరాల ఏర్పాటు



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం**

విడపనకల్లు అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో నిఘాను మరింత పటిష్టం చేస్తూ అనంతపురం జిల్లా పోలీసులు కీలక చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్, ఆదేశాల మేరకు విడపనకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలోని రెండు కీలక ప్రాంతాల్లో నాలుగు అత్యాధునిక ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ గుర్తింపు కెమెరాలను ఏర్పాటు చేశారు. సరిహద్దులు దాటి రాకపోకలు సాగించే ప్రతి వాహనం వివరాలను ఈ కెమెరాల ద్వారా ఎప్పటికప్పుడు నమోదు చేయనున్నారు. వాహనం ప్రవేశించిన సమయం, నంబర్ ప్లేట్, బయటకు వెళ్లిన వివరాలను రికార్డు చేయడం ద్వారా వాహనాల కదలికలపై నిరంతర నిఘా కొనసాగించేందుకు అవకాశం ఉంటుంది.

**నేరస్థుల కదలికలపై ప్రత్యేక నిఘా**

అనుమానాస్పద వాహనాలు, నేరాలకు పాల్పడిన వ్యక్తులు వినియోగించే వాహనాలను త్వరితగతిన గుర్తించేందుకు ఈ సాంకేతిక వ్యవస్థ పోలీసులకు ఉపయోగపడనుంది. ఇప్పటికే నేరాలకు సంబంధించి నిఘాలో ఉన్న వాహనాలు సరిహద్దు ప్రాంతాల్లో సంచరిస్తే వాటిని గుర్తించి సంబంధిత పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేసే విధంగా వ్యవస్థను వినియోగించనున్నారు.

**కేసుల ఛేదనలో సాంకేతికత కీలకం**

నేరాల నియంత్రణతో పాటు దర్యాప్తు సమయంలో వాహనాల రాకపోకలకు సంబంధించిన సమాచారాన్ని విశ్లేషించడం ద్వారా కేసుల ఛేదనకు కూడా ఈ కెమెరాలు దోహదపడనున్నాయి. అంతర్రాష్ట్ర సరిహద్దుల వద్ద వాహనాల కదలికలను సాంకేతిక పరిజ్ఞానంతో పర్యవేక్షించడం ద్వారా నేరాల నియంత్రణకు మరింత బలమైన వ్యవస్థ ఏర్పడనుంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ సరిహద్దు ప్రాంతాల్లో నిఘాను మరింత బలోపేతం చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన భద్రత కల్పించడమే పోలీసుల లక్ష్యంగా అధికారులు పేర్కొన్నారు.

## వస్త్ర దుకాణాన్ని ప్రారంభించిన చెన్నకేశవరెడ్డి

**పామిడి - సూర్య వాస్తవం :** పామిడి పట్టణంలో వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకుడు ఫరీయాద్ ఖాన్ పిలుపుమేరకు నూతన బట్టల షాపు ప్రారంభోత్సవశీ పాల్గొన్న అనంతపురం జిల్లా వైఎస్ఆర్సిపి ఆర్గనైజేషన్ సెక్రెటరీ, పామిడి చెన్నకేశవరెడ్డి, షాపుని ప్రారంభించారు. కార్యక్రమంలో పామిడి టౌన్ కన్వీనర్ నాగూర్ ఈశ్వర్ రెడ్డి వైఎస్ఆర్సిపి జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి, పామిడి సూరి వాల్మీకి, యూత్ నాయకుడు, ఇంజియాజ్, కిషోర్ రెడ్డి, సల్లుద్దీన్, 13వ వార్డు ఇన్చార్జ్ మహేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్, చంద్రశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి, బాలకృష్ణ విభూది కాసిం, విలేకర్ శ్రీనా ఉదయ్ ,వెంకటేష్, సాయి, బోయ శీను వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



# విరూపాక్షి అరెస్ట్... భయపెట్టే కుట్ర...!

- ప్రభుత్వ పెద్దల డైరెక్షన్‌తోనే అరెస్ట్ చేశారన్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి
- ఎమ్మెల్యేనే అరెస్ట్ చేస్తే.. సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్న
- అక్రమ కేసులు, అరెస్ట్‌లతో ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారని విమర్శ
- ప్రజల అండ ఉన్నంతకాలం బెదిరింపులకు తలొగ్గేది లేదన్న ప్రకాష్‌రెడ్డి
- భవిష్యత్తులో ప్రజలకు సమాధానం చెప్పక తప్పదు



**అనంతపురం - సూర్య వాస్తవం :** అలూరి ఎమ్మెల్యే విరూపాక్షిని అరెస్ట్ చేయడం వెనుక వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను భయపెట్టే కుట్ర ఉందని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆరోపించారు. సోమవారం కర్నూలు జిల్లా జైలుకు వెళ్లిన ఆయన రిమాండ్‌లో ఉన్న విరూపాక్షిని పరామర్శించారు. అనంతరం ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.

**అరెస్ట్‌లతో భయపెట్టలేరు**

విరూపాక్షిని జైల్లో పెట్టినంత మాత్రాన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు భయపడరని ప్రకాష్‌రెడ్డి అన్నారు. కార్యకర్తల కష్టంతోనే తాము ఎమ్మెల్యేలుగా గెలిచామని, ప్రజల అండ ఉన్నంతకాలం ఎలాంటి బెదిరింపులకూ తలొగ్గేది లేదన్నారు.

**ఎమ్మెల్యేను అరెస్ట్ చేసే పరిస్థితి అరుదు**

ఇల్లు, వాకిలి పగలకొట్టి ఒక ఎమ్మెల్యేను అరెస్ట్ చేసే పరిస్థితి దేశ చరిత్రలోనే అరుదని ఆయన వ్యాఖ్యానించారు. విరూపాక్షికి ఎలాంటి నేర చరిత్ర లేదని, అయినప్పటికీ కేసులు పెట్టి అరెస్ట్ చేశారని ఆరోపించారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకే అక్రమ కేసులు, అరెస్ట్‌లకు పాల్పడుతున్నారని విమర్శించారు.

**ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించే ప్రయత్నం**

రాష్ట్రంలో కరువు, తీవ్ర నీటి సమస్య, పెరుగుతున్న నిత్యావసర ధరలు, నిరుద్యోగుల్లో అసంతృప్తి, ఉద్యోగుల్లో వ్యతిరేకత వంటి సమస్యలు ఉన్నాయని ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలు మీడియాలోకి రాకుండా కేసులు, అరెస్ట్‌లతో మీడియా దృష్టిని మళ్లించే ప్రయత్నం జరుగుతోందన్నారు.

భవిష్యత్తు లో ప్రజలకు సమాధానం చెప్పక తప్పదు చంద్రబాబు ప్రభుత్వాన్ని కూలదోయాలని ప్రజలు ఇప్పటికే నిర్ణయించుకున్నారని ప్రకాష్‌రెడ్డి అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని, ప్రజా తీర్పు తప్పదని పేర్కొన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రస్తుతం చేస్తున్న దాష్టీకానికి భవిష్యత్తులో సమాధానం తప్పదని, నాలుగురెట్లు వడ్డీతో కలిసి ఫలితం అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించారు.



# బాధితులకు అండగా పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక...!

- జిల్లా నలుమూలల నుంచి 85 వినతులు స్వీకరణ
- ఆర్థిక మోసాలపై వినతులు స్వీకరించిన జిల్లా ఎస్పీ పి. జగదీష్



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదు లపై తక్షణమే స్పందించి, బాధితులకు చట్టపరిధిలో త్వరితగతిన న్యాయం అందించాలని జిల్లా ఎస్పీ పి. జగదీష్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుంచి నేరుగా వినతులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకురాగా, మొత్తం 85 వినతులను ఆయన స్వీకరించారు. కుటుంబ సమస్యలు, భూవివాదాలు, దారుల వివాదాలు, ఆర్థిక మోసాలు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులు ఇందులో ఉన్నాయి. అందిన ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత కాలపరిమితిలో పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. బాధితుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేకుండా, పారదర్శకంగా మరియు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజలకు పోలీసు శాఖపై మరింత నమ్మకం కలిగేలా అధికారులు పనిచేయాలని స్పష్టం చేశారు.

**పిటిషనర్లకు ఉచిత భోజనం**

ఇస్కాన్ సంస్థ సహకారంతో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరైన వినతిదారులు, వారి సహాయకులకు ఉచితంగా భోజనం అందించారు.

ఈ కార్యక్రమంలో అదనపు పోలీసు సూపరింటెండెంట్ ఎం. నాగభూషణం, మహిళా పోలీసు ఉపాధికారి శివప్రసాద్‌తో పాటు పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలకు వైద్యం అందించడమే నా కర్తవ్యం : రామకమార్



**పామిడి - సూర్య వాస్తవం :** మండల కేంద్రమైన పామిడి పట్టణంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) సందర్భంగా సోమవారం రెవెన్యూ శాఖ కార్యాలయం ఆవరణంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని ప్రభుత్వఆయుర్వేద వైద్యశాల డాక్టర్ రాంకుమార్ ప్రజలకు వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం రెవెన్యూ కార్యాలయంకు సమస్యల కోసం వచ్చి పోయే ప్రజల ఆరోగ్య నిమిత్తమై ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాఖ ఆధ్వర్యంలో వైద్య సేవలు నిర్వహించబడును అని డాక్టర్ రామ్ కుమార్ తెలిపారు. మంగళ బుధ గురు వారాలలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న ఆయుర్వేద శాలలో చికిత్స నిర్వహించడం జరుగుతుందని రోజు ఉదయం 9 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, తిరిగి మూడు గంటల నుంచి 5 గంటల వరకు వైద్య సేవలు అందిస్తున్నామని ఆయన తెలిపారు. ఆయుర్వేదశాఖలో ఆయుర్వేదం హోమియోపతి యునాని యోగ ఈ శాఖలన్నింటిని కలిపి ఆయుష్ శాఖకు సంబంధించినదిగా ఆయన పేర్కొన్నారు. సర్వ రోగాలకు ఆయుర్వేద చికిత్స అందించగలరని వీటిని అనారోగ్యప్రజలు సద్వినియోగం




## పౌర హక్కులను గౌరవించాలి

### - తహసీల్దార్ అనిల్ కుమార్

**బెలుగుప్ప- సూర్య వాస్తవం:** బెలుగుప్ప మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో సోమవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. తహసీల్దార్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పౌర హక్కులు, సమానత్వం, అంటరానితనం నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అనిల్ కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన హక్కులను గౌరవించాలని, కులమత భేదాలు లేకుండా అందరూ సమానత్వంతో జీవించాలని సూచించారు. గ్రామాల్లో ఇప్పటికీ ఉన్న రెండు గ్లాసుల పద్ధతిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని అన్నారు. అంటరానితనాన్ని నిషేధించి, సమాజంలో సమానత్వ భావనను పెంపొందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి లక్ష్మీనారాయణ, హెడ్ కానిస్టేబుల్ వన్నూరు స్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- మంత్రి పయ్యావుల కేశవ్...!
- అనంతపురంలో ప్రజాదర్బార్ నిర్వహించిన ఆర్థిక మంత్రి
- వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలు.. వినతులు స్వీకరించిన మంత్రి
- సమస్యల పరిష్కారానికి అధికారులకు తక్షణ ఆదేశాలు



**అనంతపురం టౌన్ – సూర్య వాస్తవం :** అనంతపురం రామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి మంత్రి పయ్యావుల కేశవ్ వినతిపత్రాలను స్వీకరించి, వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రతి సమస్యను సానుకూలంగా పరిశీలించి, పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్రజల నుంచి వచ్చిన వినతులపై అధికారులు తక్షణమే స్పందించి, నిబంధనల మేరకు పరిష్కారం చూపాలని మంత్రి సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు.ప్రజాదర్బార్ ద్వారా ప్రజలకు నేరుగా తమ సమస్యలను మంత్రికి తెలియజేసే అవకాశం లభించడంతో పలువురు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# ఎస్ఐఆర్‌పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష...!

### పారదర్శకంగా ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టాలని ఆదేశం: కలెక్టర్ ఓ ఆనంద్




**అనంతపురం కలెక్టరేట్ – సూర్య వాస్తవం :** అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ. ఆనంద్తో కలిసి అనంతపురం జిల్లా ఎలక్టోరల్ అబ్జర్వర్, ఆంధ్రప్రదేశ్ మిషన్ ఫర్ క్లీన్ కృష్ణా–గోదావరి కెనాల్స్ మేనేజింగ్ డైరెక్టర్ జి.సి. కిషోర్ కుమార్, ఐఏఎస్ సమావేశంలో పాల్గొన్నారు.ఎస్ఐఆర్‌లో భాగంగా చేపడుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, బూత్ స్థాయిలో జరుగుతున్న కార్యకలాపాలు, అధికారుల సమన్వయం తదితర అంశాలపై సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి అభిప్రాయాలు, సూచనలను స్వీకరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిబంధనల మేరకు పారదర్శకంగా నిర్వహించేందుకు తీసుకుంటున్న చర్యలను అధికారులు వివరించారు.

# సచివాలయం-41లో ఎస్ఐఆర్ ప్రక్రియపై ఆకస్మిక తనిఖీ...!

### బీఎల్వోల కార్యకలాపాలపై వివరాలు తెలుసుకున్న ఎలక్టోరల్ అబ్జర్వర్, జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్

**అనంతపురం కలెక్టరేట్ – సూర్య వాస్తవం :** నగరంలోని నవోదయ కాలనీలో ఉన్న సచివాలయం నం.41లో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను అనంతపురం జిల్లా ఎలక్టోరల్ అబ్జర్వర్, జిల్లా కలెక్టర్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో బీఎల్వోలు నిర్వహిస్తున్న కార్యకలాపాలను పరిశీలించి, ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి చేపడుతున్న చర్యలు, పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. బీఎల్వోల వద్ద ఉన్న రికార్డులు, సంబంధిత వివరాలను పరిశీలించిన అధికారులు.. ఓటర్ల వివరాల సవరణ, పరిశీలన ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని, బీఎల్వోలు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.



## రూ.8 వేల లంచం తీసుకుంటూ

# ఏసీబీకి చిక్కిన పంచాయతీ సెక్రటరీ...!

- ఇంటి ప్లాన్ అప్రూవల్ కోసం రూ.10 వేలు డిమాండ్...
- రూ.8 వేలు తీసుకునేందుకు మధ్యవర్తిని పంపిన వైనం
- సెక్రటరీ హిదాయితుల్లాతో పాటు శానిటరీ వర్కర్ కంబగిరి అరెస్ట్






**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం**

ఇంటి నిర్మాణానికి ప్లాన్ అప్రూవల్ ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేసిన రుద్రంపేట గ్రామ పంచాయతీ సెక్రటరీ ఏసీబీకి చిక్కారు. బోయ నాగేంద్ర అనే వ్యక్తి నుంచి రూ.8 వేల లంచం తీసుకునేందుకు మధ్యవర్తిని పంపిన ఘటనలో పంచాయతీ సెక్రటరీ హిదాయితుల్లాను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనతో పాటు లంచం తీసుకున్న శానిటరీ వర్కర్ దూదేకుల కంబగిరిని కూడా అరెస్ట్ చేశారు.ఏసీబీ డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బోయ నాగేంద్రకు బత్తలపల్లిలోని ఫ్లాట్ నంబర్ 21, సర్వే నంబర్ 121–3బి పరిధిలో నాలుగు సెంట్ల స్థలం ఉంది. ఆ స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు ప్లాన్ అప్రూవల్ కోసం గ్రామ పంచాయతీకి దరఖాస్తు చేసుకున్నారు. సంబంధిత ఫీజులు చెల్లించినప్పటికీ అప్రూవల్ ఇచ్చేందుకు రుద్రంపేట గ్రామ పంచాయతీ సెక్రటరీ హిదాయితుల్లా రూ.10 వేల లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.దీంతో నాగేంద్ర రూ.8 వేలు ఇచ్చేందుకు అంగీకరించారు. డబ్బులు తీసుకునేందుకు సెక్రటరీ తనకు నమ్మకస్తుడైన శానిటరీ వర్కర్ దూదేకుల కంబగిరిని పంపినట్లు డీఎస్పీ తెలిపారు.

# ఘనంగా మున్సిపల్ కమీషనర్ పదవీ విరమణ వేడుక





**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి పట్టణం గుత్తి మున్సిపల్ కమీషనర్ బడేమల్కి జబ్బార్ మియా ఉద్యోగ వి రమణ కార్యక్రమం ఘ నంగా జరిగినది.బడేమల్కి జబ్బార్ మియా, అబ్దుల్ రహీమ్ సాహెబ్, రమిజాబి దంపతులకు తే ది 01-సెప్టెం బరు-1964న సాధారణ రైతు కుటుంబంలో నల్లమల అటవీ ప్రాంతం, పవిత్ర కృష్ణా నదీ తీరాన,సంగమేశ్వర దేవాలయము ప్రక్కనే గల ముసలిమడుగు అనే గ్రామంలో జన్మించారు.ఇది ఆత్మ కూరు తాలూకా,కర్నూలు జిల్లా యందు కలదు.వారికి ఇద్దరు సోదరులు, ముగ్గురు చెల్లెళ్ళు కలరు.బా ల్యమంతా చాలా ఆహ్లాదక రంగా గ డిచిపోయింది.వారి విద్యాభ్యాస ము 7వ తరగతి వరకు అప్పటికి క రెంటు సౌకర్యము కూడా లేని ప్రాం తమైన ముసలి మడుగు నందు,10 వ తరగతి వరకు జడ్పీఎహెస్ఎస్ పాతకోటలో ప్రతి దినం కాలినడకన 7 కిలోమీటర్లు నడిచి వె ళ్ళి హైస్కూలు విద్యను పూర్తి చేసుకున్నారు. ఇంటర్మీడియట్ ఆత్మకూరు జూనియర్ కాలేజీలో, డిగ్రీ బి.ఎస్ సి కర్నూలు ఉస్మానియా కాలేజీలో మరియు శానిటరీ ఇన్స్పెక్టర్ కోర్సు కర్నూలు మెడికల్ కాలేజీలో పూర్తి చేసు కున్నారు.మొట్టమొదట 198 5 డిసెంబరు 27వ తారీ ఖున తాడి పత్రి మున్సిపాలిటీ యందు హెల్త్ అసిస్టెంట్‌గా జాయిన్ అయ్యారు. తాడిపత్రి యందు అప్పటి మున్సి పల్ కాంట్రాక్టర్ కు మ్మెత ఖాదర్ మొ హిద్దీన్ పిల్లవాడు ఎర్రగా బుర్రగా ఉ న్నాడని,మంచి ఉద్యోగ మని తలచి తన మొదటి కుమార్తె అయిన కు మ్మెత పర్వీన్ బేగంని ఇచ్చి తేదీ 15 జులై 1990 నాడు తాడిపత్రి యం దు వివాహం జరిపించారు.ఆ ఇంటి లో జబ్బార్ మియా గారే మొదటి అ ల్లుడు ఆయనతో పాటు ముగ్గురు తోడల్లుళ్ళు కలరు.వారు కూడా వివి ధ హోదాలలో పనిచేస్తున్నారు.తరు వాత ఉద్యోగ ప్రస్థానంలో 1996నుం డి 2005 వరకు దాదాపు 10 సంవ త్సరాల కాలం శానిటరీ ఇన్స్పెక్టర్‌గా తాడిపత్రి మున్సిపాలిటీ యందు ప నిచేశారు.2005 నుండి 2012 వర కు హిందూపురం యందు శానిటరీ ఇన్స్పెక్టర్ గా పనిచేశారు.2013 నుండి 2015 వరకు నంద్యాల యం దు శానిటరీ ఇన్స్పెక్ట ర్‌గా పనిచేశా రు.2018 ను డి 2019 వరకు గుం తకల్లు యందు శానిటరీ ఇన్స్పె క్టర్ గా విధులు నిర్వహించారు.2020 నుండి 2022 సెప్టెంబర్ వరకు ము న్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి పొం ది రాయదుర్గం మున్సిపాలిటీ యం దు విధులు నిర్వర్తించారు.

సెప్టెంబ రు 2022 నుండి 2023 వరకు తా డిపత్రి మున్సిపాలిటీ యందు ము న్సిపల్ కమిషనర్‌గా పనిచేశారు.త దుపరి చిత్తూరు మున్సిపల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ యందు అ డ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేశారు. 2024 జనవరి నుండి 2024 ఆగ స్టు వరకు మైదుకూరు మున్సిపాలి టీ యందు కమిషనర్ గా పనిచేశా రు.2024 ఆగస్టు 24 నుండి ఇప్పటి వరకు బదిలీపై గుత్తి పురపాలక సం ఘంలో చేరి,దాదాపు 2 సంవత్సరా ల కాలం గుత్తి మున్సిపాలిటీ యం దు మున్సిపల్ కమిషనర్‌గా సేవలం దించారు.దాదాపు 42 సంవత్సరాల సుదీర్ఘ కాలం పాటు వారు వివిధ హోదాల్లో ప్రభుత్వ సేవలను అందిం చారు.వారు పనిచేసిన అన్ని ప్రాంత ముల యందు తమ విధులను నిబ ద్ధతతో నిర్వర్తించి, ప్రజా ప్రతినిధు లు మరియు ప్రజల అందరి మన్న నలను పొంది ఉన్నారు.ఈ రోజు ఆయన పదవీ విరమణ చేసి వెళ్తు న్నందుకు మాకు ఎంతో బాధగా ఉ న్నప్పటికీ,ప్రభుత్వ ఉద్యోగంలో పద వీ విరమణ అనే ది ఒక సహజ ప్రక్రి య కాబట్టి ఏ అధికారి అయినా దా నిని పాటించక తప్పదు.పదవీ విర మణ తర్వాత శేష జీవితం వారికి, ఆయన కుటుంబానికి ఆ యురారోగ్యాలు, సుఖశాంతులు,ఆ నంద మరియు ప్రశాంతతలతో వర్ధి ల్లాలని కార్యక్రమంకు విచ్చేసిన అన్ని రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధు లు,ప్రభుత్వ అధికారులు,సిబ్బంది, సచివాలయ సిబ్బంది, కమీషనర్ ఇంతకు మునుపు విధులు నిర్వహించి న మున్సిపాలిటీల అధికారులు,సి బ్బంది, మున్సిపల్ వర్కర్స్ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి ము న్సిపల్ ఆఫీసు నుండి స్పందన ఫం క్షన్ హాలు వరకు ఘనంగా ర్యాలీ ద్వారా ఆయనకు శు భాకాంక్షలు తెలియజేశారు. ఆయన సేవలపట్ల అధికారులు, ప్రజా ప్రతినిధులు,సిబ్బంది, పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## వైద్య విద్య ఫీజుల పెంపును

# వెంటనే ఉపసంహరించుకోవాలి

- పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయొద్దు
- ఫీజుల పెంపుతో విద్యార్థులు, తల్లిదండ్రులపై పెరుగుతున్న ఆర్థిక భారం
పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. వీరేంద్ర ప్రసాద్



**అనంతపురం టౌన్ – సూర్య వాస్తవం :** రాష్ట్ర ప్రభుత్వం వైద్య, దంత వైద్య కళాశాలల్లో 2026--27 విద్యా సంవత్సరానికి విద్యార్థుల ఫీజులను పెంచడాన్ని వెంటనే ఉప సంహరించుకోవాలని పీడీఎస్‌యూ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. వీరేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. వైద్య విద్యకు సంబంధించిన పట్టభద్ర, పీజీ కోర్సుల ఫీజులను పెంచడం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కొత్త మార్గదర్శకాల ప్రకారం వైద్య విద్యలోని వివిధ కేటగిరీలకు భారీగా ఫీజులు నిర్ణయించారని తెలిపారు. వైద్య పట్టభద్ర కోర్సుల్లో 'ఏ' కేటగిరీకి రూ.18.15 లక్షలు, 'బి' కేటగిరీకి రూ.14.52 లక్షలు, 'సి' కేటగిరీకి రూ.43.56 లక్షల వరకు ఫీజులు నిర్ణయించారని పేర్కొన్నారు. దంత వైద్య కోర్సుల్లో కూడా కేటగిరీల వారీగా ఫీజులను పెంచారని తెలిపారు. పీజీ వైద్య, దంత వైద్య కోర్సుల ఫీజులను 15 శాతం పెంచడం మరింత ఆందోళనకరమన్నారు.ముఖ్యంగా పీజీ వైద్య విద్యలో 'సి' కేటగిరీకి సంవత్సరానికి రూ.66.12 లక్షల వరకు ఫీజు నిర్ణయించడం సామాన్య కుటుంబాలకు అందని భారంగా మారుతుందని వీరేంద్ర ప్రసాద్ అన్నారు. ఇప్పటికే వైద్య విద్యను అభ్యసించేందుకు విద్యార్థులు ప్రవేశ పరీక్షల శిక్షణ, ప్రైవేటు విద్యా సంస్థల ఫీజుల కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోందని తెలిపారు.ఆర్థికంగావెనుకబడిన కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులు వైద్యులుగా ఎదగాలనే తమ కలను సాకారం చేసుకునేందుకు ప్రభుత్వం విద్యను అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. అయితే ఫీజులను నిరంతరం పెంచడం ద్వారా వైద్య విద్యను సామాన్య ప్రజలకు దూరం చేయడంతో పాటు, విద్యను వ్యాపారంగా మార్చే పరిస్థితులకు ప్రభుత్వం మరింత ఊతమిస్తున్నట్లు కనిపిస్తోందని విమర్శించారు.వైద్య విద్య ఖరీదైనదిగా మారితే భవిష్యత్తులో వైద్యులుగా మారే అవకాశాలు ఆర్థిక స్థోమత ఉన్న కుటుంబాలకే పరిమితమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఫలితంగా సమాజంలోని అన్ని వర్గాలకు నాణ్యమైన వైద్య సేవలు అందే అవకాశాలపై కూడా ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.అందువల్ల 2026--27 విద్యా సంవత్సరానికి పెంచిన వైద్య, దంత వైద్య పట్టభద్ర కోర్సులతో పాటు పీజీ వైద్య, దంత వైద్య కోర్సుల ఫీజుల పెంపు నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని పీడీఎస్‌యూ అనంతపురం జిల్లా కమిటీ తరఫున జి. వీరేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు.

# తిరుపతిలో ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్

- డ్రంక్ అండ్ డ్రైవ్‌పై 20 కేసులు నమోదు.
- ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన 2 మందిపై కేసులు.
- ట్రిపుల్ రైడింగ్,సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై ప్రత్యేక తనిఖీలు.
- ఉల్లంఘించిన వాహనదారులకు కౌన్సెలింగ్, జరిమానాలు.
- రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా నిరంతర తనిఖీలు.



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, ఐపీఎస్.ఆదేశాల మేరకు,తిరుపతి ట్రాఫిక్ డీఎస్పీ పర్యవేక్షణలో తిరుపతి పట్టణంలో రోడ్డు ప్రమాదాల నివారణ,ట్రాఫిక్ క్రమబద్ధీకరణ లక్ష్యంగా సోమవారం(31.08.2026)ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు.తిరుపతి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 20 మందిపై కేసులు నమోదు చేశారు. అలాగే ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన మరో ఇద్దరిపై కేసులు నమోదు చేశారు.ఈ కేసులను తిరుపతి 1వ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో విచారించగా,డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 20 మందికి,ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన ఇద్దరికి కోర్టు జరిమానాలు విధించింది.అదేవిధంగా పూర్ణకుంభం సర్కిల్ వద్ద ట్రిపుల్ రైడింగ్,వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ వినియోగించడం వంటి ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ట్రాఫిక్ సీఐ ఎం.భాస్కర్ నాయక్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులను గుర్తించి,వారికి కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు నిబంధనల ప్రకారం జరిమానాలు విధించారు.



**“పోలీసుల సందేశం.”:-**
మద్యం సేవించి వాహనం నడపడం,ట్రిపుల్ రైడింగ్ చేయడం,డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగించడం వంటి నిర్లక్ష్యపు చర్యలు ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తాయని పోలీసులు తెలిపారు.ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ తన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాల్సిన బాధ్యతను గుర్తించాలి.
“మద్యం సేవిస్తే డ్రైవింగ్ చేయవద్దు --డ్రైవింగ్ చేస్తే సెల్‌ఫోన్ వినియోగించవద్దు --ట్రిపుల్ రైడింగ్‌కు దూరంగా ఉండండి”అనే సందేశాన్ని పాటించాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణ,ప్రజల సురక్షిత ప్రయాణం కోసం తిరుపతి ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు,అవగాహన కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తారని తెలిపారు.

# కోల్‌కతాలో ఏడకాన్ఫ్లుయెన్స్ 2026 అంతర్జాతీయ సదస్సు

## - “బెస్ట్ ఈడు-లీడర్ అఫ్ ది ఇయర్ --2026”అవార్డు అందుకున్న ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.నాగస్వామి నాయక్




**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** కర్నూలు మినిస్ట్రీ అఫ్ ఎడ్యుకేషన్,న్యూస్ ఢిల్లీ వారి సౌజన్యంతో కోల్‌కతాలో నిర్వహించిన ఆర్ కే డి ఎక్స్ టాక్స్ -- ఏడకాన్ఫ్లుయెన్స్ 2026 ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మరియు ఎన్ఎస్ఎస్ పి.ఒ డా.ఎస్.నాగస్వామి నాయక్ గారు పాల్గొన్నారు.ఈ అంతర్జాతీయ సదస్సులో విద్యారంగానికి సంబంధించిన టెక్నికల్ పేపర్‌ను సమర్పించడంతో పాటు,విద్యార్థుల విద్యాభివృద్ధి,నూతన బోధనా విధానాలు, విద్యారంగంలో వినూత్న కార్యక్రమాలు మరియు విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై విలువైన సూచనలు, సలహాలను అందించారు.కళాశాల అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం అందించిన సూచనలు,మార్గదర్శకాలను అమలు చేస్తూ, ఈ విద్యా సంవత్సరంలో 335 మంది నూతన విద్యార్థులను చేర్పించి, కళాశాల మొత్తం విద్యార్థుల సంఖ్యను 620కి పెంచడం,షినింగ్ స్టార్ అవార్డ్స్ సాధించడం,జాబ్ మేళా నిర్వహించడం, విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహనా కార్యక్రమాలను నిర్వహించడం వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిన విషయాలను సదస్సులో వివరించారు.ఈ సందర్భంగా డా.ఆర్.కే. దాస్ మినిస్ట్రీ అఫ్ ఎడ్యుకేషన్ తరఫున నిర్వహించిన ప్రత్యేక సెమినార్‌లో డా.ఎస్.నాగస్వామి నాయక్ గారి విద్యారంగ సేవలు,నాయకత్వ ప్రతిభ, కళాశాల అభివృద్ధికి చేస్తున్న కృషిని గుర్తించి “సర్టిఫికెట్ అఫ్ ఎక్సెలెన్స్”తో పాటు ప్రతిష్ఠాత్మకమైన“బెస్ట్ ఈడు- లీడర్ అఫ్ ది ఇయర్ --2026”అవార్డుకు ఎంపిక చేశారు.భారతదేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల డీన్లు,ఛాన్సలర్లు,ప్రొఫెసర్లు,ప్రిన్సిపాల్సుపాటు 35 దేశాల నుంచి హాజరైన విద్యా రంగ ప్రతినిధుల సమక్షంలో ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును డా.ఎస్. నాగస్వామి నాయక్ అందుకున్నారు.ఈ అవార్డు“ఎక్సెప్షనల్ లీడర్షిప్,డెడికేషన్ శీ ఎడ్యుకేషనల్ ఎక్సెలెన్స్ అండ్ కమిట్మెంట్ టు ఎంపవరింగ్ యంగ్ మైండ్స్”కు గుర్తింపుగా అందజేయడం విశేషం.విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు,వారిలో నైపుణ్యాలను పెంపొందించేందుకు,విద్యారంగంలో నూతన ఆలోచనలను అమలు చేసేందుకు చేస్తున్న కృషికి ఈ అవార్డు ఒక గొప్ప గుర్తింపుగా నిలిచింది. ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు ఈ అంతర్జాతీయ సదస్సులో పాల్గొనే అవకాశం కల్పించినందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి,కమిషనర్ రంజిత్ బాషా గారికి,ఆర్ జె డి డా.సి.సురేష్ బాబు కి డా. ఎస్.నాగస్వామి నాయక్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, మార్గదర్శకాలు, సహకారంతోనే కళాశాలను మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని, భవిష్యత్తులో కూడా విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం మరిన్ని వినూత్న కార్యక్రమాలను చేపడతామని ప్రిన్సిపాల్ డా.ఎస్. నాగస్వామి నాయక్ తెలిపారు.కోల్‌కతాలో జరిగిన ఈ అంతర్జాతీయ సదస్సులో ఆంధ్రప్రదేశ్ నుంచి ఏకైక ప్రతినిధిగా పాల్గొని ప్రతిష్ఠాత్మకమైన అవార్డును అందుకోవడం పట్ల ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాల సిబ్బంది,విద్యార్థులు మరియు విద్యాభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ డా.ఎస్. నాగస్వామి నాయక్ కి అభినందనలు తెలిపారు.

# మూడేళ్ల చిన్నారిపై వీధికుక్క దాడి..ముఖంపై 20 కుట్లు.

## - కలిపేడు పంచాయతీ మూర్తిరెడ్డిపాళెంలో ఘటన



**దొరవరిసత్రం -సూర్య వాస్తవం:**అభం శుభం తెలియని మూడేళ్ల చిన్నారిపై వీధి కుక్కలు దాడి చేసిన ఘటన నాయుడుపేట మండలం కలిపేడు పంచాయతీ మూర్తిరెడ్డిపాళెం పరిధిలో చోటుచేసుకుంది.ఆడుకుంటూ వీధిలోకి వెళ్లిన చిన్నారిపై ఒక్కసారిగా కుక్క దాడి చేసి ముఖాన్ని చిందరవందరగా చీల్చింది.చిన్నారి గట్టిగా ఏడవడంతో తల్లిదండ్రులు, స్థానికులు కుక్కను వెంటాడటంతో చిన్నారిని వదిలేసి వెళ్లింది.ఈ ఘటనలో చిన్నారి ముఖంపై 20 కుట్లు పడ్డాయి.నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన కేశయ్య,చెంగమ్మ దంపతులు కొన్ని రోజులుగా నాయుడుపేట మండలం కలిపేడు పంచాయతీ మూర్తిరెడ్డిపాళెం పరిధిలో బాటలు వేస్తూ జీవనం సాగిస్తున్నారు.వారి మూడేళ్ల కుమార్తె గురువారం బయటకు వెళ్లగా ఈ ఘటన చోటుచేసుకుంది.కుక్క దాడిలో తీవ్రంగా గాయపడిన చిన్నారిని వెంటనే నాయుడుపేట సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.అక్కడ విధుల్లో ఉన్న సర్జన్ డాక్టర్ గురు ప్రసాద్ చిన్నారికి సుమారు ఒకటిన్నర గంట పాటు చికిత్స అందించి,ముఖంపై 20 కుట్లు వేసి సురక్షితంగా కాపాడారు.చిన్నారికి మెరుగైన వైద్యం అందించడంతో పాటు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నట్లు ఆసుపత్రి ఇన్‌చార్జి అమర్‌నాథ్ తెలిపారు.చిన్నారి ఆరోగ్యం మెరుగుపడే వరకు వైద్య సేవలు అందిస్తామని పేర్కొన్నారు.కాగా,చిన్నారి ప్రాణాలను కాపాడి,మెరుగైన వైద్యం అందించిన డాక్టర్ గురు ప్రసాద్‌కు చిన్నారి కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

# వ్యవసాయ మోటార్ల చోరీకి చెక్..

## -ఆటోలో తరలిస్తుండగా పట్టుకున్న గ్రామస్తులు
## -పునబాకలో పట్టుబడ్డ ముగ్గురు నిందితులు.. పోలీసులకు అప్పగింత

**పెళ్లకూరు -సూర్య వాస్తవం:**వ్యవసాయ విద్యుత్ మోటార్లను చోరీ చేసి ఆటోలో తరలిస్తుండగా పునబాక గ్రామస్తులు అప్రమత్తమై నిందితులను పట్టుకుని పోలీసులకు అప్పగించిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది.అందిన సమాచారం మేరకు.. బుచ్చినాయుడుకండ్రిగ మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో మూడు వ్యవసాయ విద్యుత్ మోటార్లను చోరీ చేసిన నిందితులు వాటిని ఆటోలో శ్రీకాళహస్తికి తరలిస్తున్నారు. ఈ క్రమంలో పునబాక గ్రామం మీదుగా వెళ్తుండగా గ్రామస్తులకు అనుమానం రావడంతో ఆటోను అడ్డుకుని తనిఖీ చేశారు. అందులో చోరీ చేసిన వ్యవసాయ విద్యుత్ మోటార్లు ఉన్నట్లు గుర్తించారు.వెంటనే గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. చోరీకి పాల్పడిన వ్యక్తులు సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, పునబాక ప్రాంతాలకు చెందినవారిగా గుర్తించినట్లు సమాచారం. అనంతరం నిందితులను, చోరీ చేసిన మోటార్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి పోలీసులకు అప్పగించారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులు ఇంకా ఎక్కడెక్కడ చోరీలకు పాల్పడ్డారు? ఈ చోరీల వెనుక మరెవరైనా ఉన్నారా? అనే కోణాల్లో పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం.




# మహిళల భద్రత, సైబర్ నేరాలు,మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన

## - యువత నేరాలకు,మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా పోలీసుల సూచనలు






**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీ ఎల్.సుబ్బ రాయుడు, ఐపీఎస్.ఆదేశాల మేరకు,రేణిగుంట డీఎస్పీ సూచనలతో గాజుల మండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని వి.బి.ఆర్.కళాశాలలో మహిళలపై జరిగే నేరాలు, మహిళల భద్రత, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఇన్‌స్పెక్టర్ మంజునాథరెడ్డి,ఎస్ఐ హరీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులు పాల్గొన్నారు. మహిళల భద్రత,సైబర్ మోసాల పట్ల అప్రమత్తత, అనుమానాస్పద లింకులు,సందేశాలకు స్పందించకూడదనే అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ విజయ్ భాస్కర్,వైస్ ప్రిన్సిపల్ దేవి,అధ్యాపకులు పాల్గొన్నారు. అదేవిధంగా,సూళ్లూరుపేట నందా ఫంక్షన్ హాల్‌లో పిడిఎస్ యు ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థుల సమావేశంలో సీఐ,సూళ్లూరుపేట పాల్గొని మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, వాటి వల్ల యువత భవిష్యత్తుపై కలిగే నష్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ, సూళ్లూరుపేటతో పాటు వివిధ కళాశాలలకు చెందిన సుమారు విద్యార్థులు పాల్గొన్నారు.యువత మాదకద్రవ్యాలకు,నేరాలకు దూరంగా ఉండాలని, మహిళల భద్రత మరియు సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.జిల్లా వ్యాప్తంగా ఇటువంటి అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# పద్యాల పఠణ పోటీలో ప్రతిభ కనబరిచిన 5వ తరగతి విద్యార్థిని..తనుశ్రీ



**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** ఏకాగ్రతకు,పట్టుదల తోడైతే ఏదైనా అనుకున్నది సాధించొచ్చని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని నిజం చేసింది.దొరవారిసత్రం మండల పరిధిలోని తల్లంపాడు మోడల్ ప్రైమరీ పాఠశాలలో చదువుతున్న ఐదో తరగతి విద్యార్థి ఎం,తనుశ్రీ, సూళ్లూరుపేట లోని సత్య సాయి మందిర్ ఎడ్యుకేషనల్ వింగ్ కన్వీనర్ విమలా రెడ్డి అన్యర్వహించిన డివిజన్ స్థాయి పద్యాల పోటీలో ఏకధాటిగా తెలుగు పుస్తకంలోని పద్యాలను వల్లించి అందరినీ ఆశ్చర్యపరచింది.ఆమె ప్రతిభను గుర్తించిన సాయి మందిర్ తనుశ్రీకి ఆదివారం రాత్రి ప్రశంసా పత్రాన్ని అందించి ప్రశంసించారు.పాఠశాల హెచ్ఎం రవికుమార్,ఉపాధ్యాయులు హుస్సేన్ బాబు, శ్రీనివాసులు తనుశ్రీని ప్రశంసించారు.

# గుర్తు తెలియని వ్యక్తిని చంపి బురదనీటిలో పడవేసిన కేసులో ఇద్దరు ముద్దాయిలు అరెస్టు



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో గుర్తు తెలియని వ్యక్తి మద్యం తాగి రైల్వే స్టేషన్ కు ఎటుపోవాలో తెలియక నిధి వైన్ షాప్ వద్ద తేది 21వ తేదీ రాత్రి సుమారు 09.30 గంటల నుండి తిరుగుతుండగా అది గమనించిన ఇద్దరు ముద్దాయిలు సదరు వ్యక్తి వద్ద ఏదైనా విలువైన వస్తువులు ఉంటాయని గ్రహించి అతనిని వారి యొక్క మోటార్ సైకిల్ పై ఎక్కించుకొని కెఆర్పి వెహికల్ గ్యారేజ్ వెనుక వైపు మణిదీప్ లేఅవుట్స్ కు తీసుకొని వెళ్లి అతనికి మద్యం తాగించి,గొడవ పెట్టుకొని రాయితో ముఖము మీద కొట్టి,బీర్ బాటిల్ తో ఎడమవైపు మెడ పై పొడవగా సదరు గుర్తు తెలియని వ్యక్తి రక్తము తో అక్కడికిఅక్కడే చనిపోగా సదరు వ్యక్తి చేతికి ఉన్న వాచ్చి ని తీసుకొని సదరు వ్యక్తిని మరియు రాయిని బురద మడుగులోనికి విసిరేసి, సదరు గుర్తు తెలియని వ్యక్తి యొక్క బ్యాగును ముద్దాయిలు తియ్యగా అందులో బట్టలు,పూరి బాక్స్ మరియు రూ200/-ఉండగా డబ్బులు తీసుకొని,బ్యాగులో బట్టలు మరియు స్టీల్ టిఫిన్ బాక్స్ ను పెట్టుకొని మన్నే ముత్తేరి గ్రామము నకు పోవు రోడ్డ నందు,కోళ్ళమిట్ట స్మశానము వద్ద కు వెళ్లి బ్యాగును తగలపెట్టి పారిపోయినారు.డిఎస్పి చెంచుబాబు పర్యవేక్షణలో సూళ్ళురుపేట సీఐ మురళీకృష్ణ,ఎస్పై అజయ్ కుమార్ మరియు వారి సిబ్బంది సహకారంతో కేసుని అత్యంత నైపుణ్యం తో దర్యాప్తు చేసి ముద్దాయిని తేది 31.08.2026 న అరెస్టు చేయడం జరిగింది. సూళ్లూరుపేట సిఐ మురళీకృష్ణ ను ఎస్పై అజయ్ కుమార్ ను మరియు సిబ్బందిని డీఎస్పీ చెంచుబాబు అభినందించారు.




## రోహిత్ శర్మ కొత్త అవతారం..

## 'ఫ్యామిలీ ఫుల్ హౌస్' షోతో ఎంట్రీ

### అడుగుపెడుతున్న రోహిత్ శర్మ
### 'ఫ్యామిలీ ఫుల్ హౌస్' పేరుతో సోనీలో కొత్త షో
### సెప్టెంబర్ 19 నుంచి ప్రసారం కానున్న కార్యక్రమం

భారత స్టార్ క్రికెటర్ 'హిట్‌మ్యాన్' రోహిత్ శర్మ సరికొత్త అవతారంలో అలరించనున్నాడు. క్రికెట్ మైదానంలో పరుగుల వరద పారించిన అతడు, ఇప్పుడు వినోద రంగంలోకి అడుగుపెడుతున్నాడు. సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా రూపొందిస్తున్న 'ఫ్యామిలీ ఫుల్ హౌస్' అనే సరికొత్త షోకు రోహిత్ వ్యాఖ్యాతగా వ్యవహరించనున్నాడు. ఈ కార్యక్రమం 2026 సెప్టెంబర్ 19వ తేదీ నుండి సోనీ ఎంటర్‌టైన్‌మెంట్ టెలివిజన్ ఛానెల్‌తో పాటు సోనీ లివ్ ఓటీటీలో ప్రసారం కానుంది. ఈ విషయాన్ని సోమవారం ప్రకటించారు. ప్రస్తుతం రోహిత్ శర్మ టెస్ట్, టీ20 ఫార్మాట్ల నుంచి రిటైర్ అయినా, వన్డే ఫార్మాట్‌లో కెప్టెన్‌గా కొనసాగుతున్నాడు. ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో అద్భుతంగా రాణించాడు. ముఖ్యంగా 388 పరుగుల భారీ ఛేదనలో 138 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చాడు. మూడు మ్యాచ్‌ల ఆ సిరీస్‌లో రోహిత్ మొత్తం 175 పరుగులు సాధించాడు. ఈ క్రమంలోనే 2027 ప్రపంచకప్‌లోనూ హిట్ మ్యాన్ ఆడతాడనే ఊహాగానాలు జోరుగా సాగుతున్నాయి. సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ తమ పండుగ సీజన్ కంటెంట్ లైనప్‌లో భాగంగా ఈ షోను ప్రకటించింది. ఈ జాబితాలో అమితాబ్ బచ్చన్ హోస్ట్ గా చేస్తున్న 'కౌన్ బనేగా కరోడ్‌పతి' నూతన సీజన్, అజయ్ దేవగణ్ వ్యాఖ్యాతగా వస్తున్న 'క్రైమ్ పెట్రోల్ 2026', హన్సల్ మెహతా దర్శకత్వంలో రూపొందుతున్న 'స్కామ్ 2010' వంటి భారీ ప్రాజెక్టులు కూడా ఉన్నాయి. ఇప్పుడు వీటి సరసన రోహిత్ శర్మ షో కూడా చేరడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత నెలకొంది.

## 'రోమాంచకం'లో బబ్లీ గర్ల్ పాత్ర..

# నా కల నెరవేరింది: అనంతిక సనిల్‌కుమార్



ప్రేమ నుంచే ఉత్కంఠ పుడుతుందని ఆసక్తికర వ్యాఖ్యలు సెప్టెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల బ్లాక్‌బస్టర్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా సమర్పణలో, భద్రకాళి పిక్చర్స్ పతాకంపై సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్‌కుమార్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'రోమాంచకం'. ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్న ఈ చిత్రంతో వేణుగోపాల్ రెడ్డి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ప్రేమ, హాస్యం, ఉత్కంఠ కలగలిసిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమా సెప్టెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సోమవారం చిత్ర హీరోయిన్ అనంతిక మీడియాతో ముచ్చటించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా అనంతిక మాట్లాడుతూ, "'8 వసంతాలు' తర్వాత చాలా కథలు విన్నాను. కానీ ఏదీ నన్ను అంతగా ఆకట్టుకోలేదు. ఆ సమయంలో 'రోమాంచకం' కథ వినగానే చాలా సంతోషం వేసింది. నేను చేయాలనుకున్న సినిమా ఇదే అనిపించింది. ఈ సినిమాలో బబ్లీగా, సరదాగా ఉండే అమ్మాయి పాత్ర నాది. ఇలాంటి పాత్ర చేయాలని ఎప్పటినుంచో కలలు కన్నాను" అని తెలిపారు. "ఈ చిత్రం యువతకు బాగా కనెక్ట్ అవుతుంది. ఇది కేవలం ప్రేమకథ మాత్రమే కాదు, ఇందులో హాస్యంతో పాటు ఉత్కంఠ కూడా ఉంటుంది. యూత్‌తో పాటు కుటుంబ ప్రేక్షకులు కూడా ఎంజాయ్ చేయవచ్చు. ఇందులో నేను తమిళ అమ్మాయిగా కనిపిస్తాను. హీరో సుమంత్ ప్రభాస్ పాత్ర చాలా ఎనర్జిటిక్‌గా ఉంటుంది. దానికి తగ్గట్టుగానే నా పాత్రను కూడా డిజైన్ చేశారు. మా ఇద్దరి మధ్య సంభాషణలు చాలా సహజంగా, వేగంగా సాగుతాయి" అని ఆమె వివరించారు. రోమాంచకం సినిమా చిత్రీకరణ అనుభవాల గురించి చెబుతూ, "షూటింగ్ సమయంలో ఎంత సరదాగా గడిపామో, సినిమా చూస్తున్నప్పుడు ప్రేక్షకులు కూడా అంతే ఎంజాయ్ చేస్తారు. సందీప్ గారు నా నటనను మెచ్చుకోవడం సంతోషంగా ఉంది. నిర్మాత ప్రణయ్ రెడ్డి గారిని మొదట చూసినప్పుడు కోపం ఎక్కువ అనుకున్నాను, కానీ ఆయన చాలా సరదా మనిషి. సుమంత్ ప్రభాస్‌తో తొలిరోజే మంచి స్నేహం కుదిరింది" అంటూ షూటింగ్ అనుభవాలను పంచుకున్నారు. చిన్నప్పటి నుంచి తనకు కళలంటే ఇష్టమని, ఎల్‌కేజీ నుంచే డ్యాన్స్ నేర్చుకుంటున్నానని, ఆ అనుభవమే నటిగా తనకు ఎంతగానో ఉపయోగపడుతోందని అనంతిక పేర్కొన్నారు. మంచి అవకాశాలు వస్తే ఏ భాషలోనైనా నటిస్తానని ఆమె స్పష్టం చేశారు. చివరగా, "రోమాంచకం సినిమాలో ప్రేమ, హాస్యం, ఉత్కంఠ అనే మూడు అంశాలు బలంగా ఉంటాయి. ముఖ్యంగా ప్రేమ నుంచే ఉత్కంఠ పుట్టడం ఆసక్తికరంగా ఉంటుంది. ఈ సినిమా నాకే కాకుండా హీరోకి కూడా మంచి గుర్తింపు తెస్తుందని నమ్ముతున్నాను. ప్రస్తుతం తెలుగు, తమిళ, మలయాళంలో కొన్ని ప్రాజెక్టుల చర్చలు జరుగుతున్నాయి" అని ఆమె ముగించారు.






# మెస్సీ శకం ముగిసింది..

## అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన లెజెండ్

ఫుట్‌బాల్ ప్రపంచంలో ఒక శకం ముగిసింది. అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం, కోట్లాది మంది అభిమానుల ఆరాధ్య దైవం లియోనెల్ మెస్సీ తన అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. రెండు దశాబ్దాల పాటు అర్జెంటీనా జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆ లెజెండ్, ఇకపై దేశం తరఫున బరిలోకి దిగనని సోమవారం (ఆగస్టు 31) సంచలన ప్రకటన చేశాడు. ఈ మేరకు తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఒక భావోద్వేగ లేఖను పోస్ట్ చేశాడు. 2026 ప్రపంచకప్ ఫైనల్‌లో స్పెయిన్ చేతిలో ఓటమి పాలైనప్పటి నుంచే రిటైర్మెంట్ ఆలోచనలో ఉన్నానని, తన తండ్రి మరణం ఆ నిర్ణయాన్ని మరింత బలపరిచిందని మెస్సీ ఆ లేఖలో పేర్కొన్నాడు. మెస్సీ వీడ్కోలు వార్త ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఫుట్‌బాల్ అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది.



### భావోద్వేగ లేఖలో మెస్సీ ఏమన్నాడంటే?

"ఫైనల్ ముగిసినప్పటి నుంచి సుదీర్ఘంగా ఆలోచించిన తర్వాత, నేను జాతీయ జట్టు నుంచి రిటైర్ అవుతున్నానని అందరికీ తెలియజేయాలనుకుంటున్నాను" అని మెస్సీ తన ప్రకటనను ప్రారంభించాడు. తన కెరీర్ ఆద్యంతం అర్జెంటీనా అభిమానులతో, జాతీయ జట్టుతో పెనవేసుకున్న అనుబంధం కారణంగా ఈ నిర్ణయం తీసుకోవడం చాలా బాధాకరంగా ఉందని తెలిపాడు. "ఈ నిర్ణయం నన్ను తీవ్రంగా గాయపరిచింది, ఇప్పటికీ బాధిస్తూనే ఉంది. కానీ, ఇదే సరైన సమయమని నేను అర్థం చేసుకున్నాను. నా దేశం కోసం నేను ఎప్పుడూ సర్వస్వం ఇచ్చానని ప్రమాణం చేస్తున్నాను. కేవలం గెలిచిన మ్యాచ్ లలోనే కాదు, అంతకుముందు కూడా ఈ జెర్సీ కోసం నేను ఎప్పుడూ పోరాడాను, నా సర్వశక్తులు ఒడ్డాను. ఫుట్‌బాల్ ద్వారా మీకు ఆనందాన్ని పంచడానికి, అర్జెంటీనా పౌరుడిగా మీరు గర్వపడేలా చేయడానికి ప్రయత్నించాను" అని భావోద్వేగంగా రాసుకొచ్చాడు.

తన రిటైర్మెంట్ నిర్ణయం వెనుక ఉన్న బలమైన కారణాలను మెస్సీ స్పష్టంగా వివరించాడు. జూలైలో జరిగిన 2026 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌లో స్పెయిన్‌పై అర్జెంటీనా ఓటమి పాలవడం తనను తీవ్రంగా కలచివేసిందని తెలిపాడు. ఆ ఓటమి తర్వాత రెండు రోజులకే, అంటే జూలై 21నే తాను ఈ వీడ్కోలు లేఖను రాసుకున్నట్లు వెల్లడించాడు. అయితే, ఇటీవల మా నాన్న మరణం తర్వాత, ఇక కొనసాగలేనన్న నమ్మకం బలపడింది" అని పేర్కొన్నాడు. మెస్సీకి తండ్రి జార్జ్ మెస్సీనే ఏజెంట్‌గా వ్యవహరించారు. సుదీర్ఘ అనారోగ్యంతో ఆగస్టు 8న మరణించిన విషయం తెలిసిందే. కాలం గడిచిపోవడం, కొత్త తరం క్రీడాకారులు జట్టులోకి రావడం కూడా తన నిర్ణయానికి ఒక కారణమని మెస్సీ వివరించాడు. "నాకు మిగిలింది తక్కువ సమయమే. నా జీవితంలో కొన్ని అధ్యాయాలు ముగింపు దశకు వస్తున్నాయి. అందులో ఇది ఒకటి. ఇది నన్ను చాలా బాధిస్తోంది. నేను జాతీయ జట్టులో భాగమవ్వడాన్ని ప్రేమించాను, ప్రేమిస్తున్నాను, ఎప్పటికీ ప్రేమిస్తూనే ఉంటాను. నా దగ్గర ఉన్నదంతా ఇచ్చేశాను. ఇక ఇవ్వడానికి ఏమీ మిగల్లేదు. అంతేకాకుండా, అద్భుతమైన యువ క్రీడాకారులు వస్తున్నారు. వారికి అవకాశం దక్కాలి" అని పేర్కొన్నాడు. లెట్స్ గో, అర్జెంటీనా!" అంటూ తన లేఖను ముగించాడు. 2005లో అర్జెంటీనా సీనియర్ జట్టులోకి అరంగేట్రం చేసిన మెస్సీ, 207 మ్యాచ్‌లతో దేశం తరఫున అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. 125 గోల్స్ సాధించాడు. తన కెరీర్‌లో 2022లో ప్రపంచకప్ విజయం, రెండు కోపా అమెరికా టైటిళ్లు వంటి శిఖరాలను అధిరోహించడంతో పాటు, 2014, 2026 ప్రపంచకప్ ఫైనల్స్‌లో ఓటముల వంటి బాధాకరమైన క్షణాలను కూడా చవిచూశాడు. అతడి అంతర్జాతీయ కెరీర్ ముగిసినప్పటికీ, క్లబ్ ఫుట్‌బాల్‌లో మాత్రం కొనసాగనున్నారు. 2028 వరకు కాంట్రాక్ట్ ఉన్న ఇంటర్ మయామి జట్టు తరఫున ఆయన ఆడటం కొనసాగిస్తాడు. మెస్సీ వీడ్కోలుతో అర్జెంటీనా ఫుట్‌బాల్‌లో ఒక స్వర్ణయుగం ముగిసినట్లయింది.



## సీఎస్కేలో ధోనీ వాటా..

## వదంతులను ఖండించిన సీఈవో

చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) ఫ్రాంచైజీలో ఆ జట్టు మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ వాటా కోరుతున్నట్లు వస్తున్న వార్తలను సీఎస్కే యాజమాన్యం ఖండించింది. ఈ కథనాల్లో ఎలాంటి వాస్తవం లేదని, అవన్నీ కేవలం నిరాధారమైన వదంతులని సీఎస్కే సీఈవో కాశీ విశ్వనాథన్ స్పష్టం చేశారు. దీంతో గత కొన్ని రోజులుగా సాగుతున్న ప్రచారానికి తెరపడింది. ఐపీఎల్ ప్రారంభం నుంచి సీఎస్కేతో ధోనీకి విడదీయరాని అనుబంధం ఉంది. అతడి సారథ్యంలో జట్టు ఏకంగా ఐదుసార్లు ఐపీఎల్ టైటిళ్లను కైవసం చేసుకుంది. ఈ నేపథ్యంలో, ఫ్రాంచైజీతో తన బంధాన్ని మరింత బలోపేతం చేసుకునే క్రమంలో ధోనీ సుమారు 20 శాతం వాటాను కొనుగోలు చేయాలని భావిస్తున్నాడని, కానీ సీఎస్కే యాజమాన్యం కేవలం 3 శాతం మాత్రమే ఆఫర్ చేసిందని కథనాలు వెలువడ్డాయి. ఈ పరిణామాలతో ఇరువర్గాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయని కూడా జోరుగా ప్రచారం జరిగింది. ఈ వదంతులపై కాశీ విశ్వనాథన్ స్పందిస్తూ, "ధోనీ వాటా అడిగాడన్న వార్తల్లో ఏమాత్రం వాస్తవం లేదు. అవన్నీ కేవలం పుకార్లు మాత్రమే" అని కొట్టిపారేశారు. ఇక వచ్చే సీజన్‌లో ధోనీ ఆడతాడా లేదా అనే విషయంపై కూడా ఆయన వివరణ ఇచ్చారు. "వచ్చే సీజన్‌లో తాను ఆడనని ధోనీ మాతో ఎప్పుడూ చెప్పలేదు. ఏదైనా అతడిదే తుది నిర్ణయం" అని తెలిపారు. కాగా, 2025 మెగా వేలానికి ముందు సీఎస్కే ధోనీని రూ. 4 కోట్లకు రిటైన్ చేసుకుంది. అయితే, గాయం కారణంగా 2026 సీజన్‌లోని ఒక్క మ్యాచ్‌లో కూడా ధోనీ ఆడలేకపోయాడు.

# రవాణా కార్మికుల పిల్లల విద్యకు శ్రీరామ్ ఫైనాన్స్ స్కాలర్‌షిప్ అభినందనీయం

### -మంత్రి మండిపల్లి





**అన్నమయ్య బ్యూరో –సూర్య వాస్తవం:** విద్యార్థుల భవిష్యత్తుకు అండగా స్కాలర్‌షిప్ కార్యక్రమం శ్రీరామ్ ఫైనాన్స్ ప్రతినిధులురవాణా, లాజిస్టిక్స్ రంగంలో పనిచేస్తున్న కార్మికుల పిల్లల విద్యను ప్రోత్సహించేందుకు శ్రీరామ్ ఫైనాన్స్ చేపడుతున్న ఎడ్యుకేషన్ స్కాలర్‌షిప్ కార్యక్రమాన్ని నిర్వాహకులు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కలిసి వివరించారు. 8వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న అర్హులైన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించే ఈ కార్యక్రమం ద్వారా ఆర్థిక ఇబ్బందుల కారణంగా విద్యకు దూరమయ్యే పరిస్థితులను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమ వివరాలను తెలుసుకున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హర్షం వ్యక్తం చేసి, విద్యార్థుల భవిష్యత్తుకు తోడ్పడే ఇటువంటి సామాజిక బాధ్యత కార్యక్రమాలను అభినందించారు.

# ఖర్గేపై కుల వివక్ష దుర్మార్గం..

### -రాహుల్ గాంధీపై పెట్టిన అక్రమ కేసును ఖండించిన ఇర్ఫాన్ బాషా



**ప్రొద్దుటూరు – సూర్య వాస్తవం :** ఉత్తరా ఖండ్‌లోని హల్ద్వానీ రాంలీలా మైదానంలో ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే పర్యటించిన అనంతరం సభా ప్రాంగణాన్ని శుద్ధి చేయడం అత్యంత హేయమైన చర్య అని, ఇది ముమ్మాటికీ బహిరంగ కుల వివక్ష, అంటరాని తనమేనని కాంగ్రెస్ నాయకుడు ఇర్ఫాన్ బాషా తీవ్రంగా ఖండించారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఒక జాతీయ స్థాయి నాయకుడు, పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేతగా ఉన్న వ్యక్తికే ఇలాంటి వివక్షాపూరిత అవమానం ఎదురైతే, దేశంలో సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు? ఈ దుశ్చర్య రాజ్యాంగ స్ఫూర్తిని, ప్రజాస్వామ్య విలువలను తీవ్రంగా కాలరాయడమేనని ఆయన మండిపడ్డారు. ఈ అమానవీయ ఘటనపై కాంగ్రెస్ పార్టీ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ, దోషులపై చర్యలు తీసుకోకుండా కుల వివక్షను ప్రశ్నించిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపైనే ఎఫ్ఐఆర్ నమోదు చేయడంపై ఇర్ఫాన్ బాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. బడుగు, బలహీన వర్గాలు, బీసీలు, మైనారిటీల హక్కుల కోసం నిరంతరం పోరాడే రాహుల్ గాంధీని ఇలాంటి అక్రమ కేసులతో భయపెట్టలేరని ఆయన స్పష్టం చేశారు. బీజేపీ నాయకత్వం రాహుల్ గాంధీని తక్కువగా అంచనా వేస్తోందని, ఇలాంటి అణచివేత చర్యల వల్ల ఆయన పోరాట పటిమ మరింత బలపడుతుందే తప్ప తగ్గదని హెచ్చరించారు. తక్షణమే రాహుల్ గాంధీపై పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని, సభా ప్రాంగణాన్ని శుద్ధి చేసి కుల వివక్షకు పాల్పడిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# నేపాల్‌లో జరిగిన సంఘటన చాలా బాధాకరం

### -నేపాల్ లో ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన ఏపీసిసి జనరల్ సెక్రెటరీ షేక్ అల్లాబకష్




**రాయచోటి–సూర్య వాస్తవం:** నేపాల్‌లో మొన్న జరిగిన సంఘటన ఒక మనిషిగా తనను తీవ్రంగా బాధ కలిగించిందని ఏపీసిసి జనరల్ సెక్రెటరీ షేక్ అల్లాబకష్ (సీఎల్పీ) అన్నారు. సోమవారం రాయచోటి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ పాత కార్యాలయంలో సూర్య వాస్తవం ప్రతినిధి కలిసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కడ చిక్కుకున్న భారతీయులను సురక్షితంగా భారతదేశాన్ని తిరిగి తీసుకువచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయడం, వారందరినీ క్షేమంగా తీసుకురావడానికి, ప్రాణాలు కోల్పోయిన వారికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉండాలని ఆయన ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. ఎంతోమంది అభంశుభంతెలియనటువంటి వ్యక్తులు ఏం జరుగుతుం దని ఊహించుకునే లోపే వారి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయని, ఇంతటి ఘోరమైన సంఘటనను తను ఎప్పుడూ చూడలేదని ఆయన తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. ప్రకృతి ఈ స్థాయిలో కన్నెర చేస్తుందని ఊహించలేదని ఆయన చెప్పారు.

# పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపరాదు

### - జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



**అన్నమయ్య బ్యూరో– సూర్య వాస్తవం:** పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపకుండా... సకాలంలో నాణ్యతగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టోరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ తోపాటు.. జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ ఏ. వెంకటేష్, కెఆర్ఆర్సి ఎస్డిసి చంద్రశేఖర్ రెడ్డి ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ ల అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అర్జీలను వేగవంతంగా, నాణ్యతగా పరిష్కరించాలన్నారు. ఎలాంటి పెండింగ్ లేకుండా అర్జీలను పరిష్కరించాలని, గ్రీవెన్స్ పై ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలని, ఇందులో ఎలాంటి అలసత్వం ఉండరాదన్నారు. సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అర్జీలను గడువులోపు అత్యంత నాణ్యతగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్వహించే ఐవిఆర్ఎస్ కాల్స్ నందు పాజిటివ్ పర్ఫార్మెన్స్ (సానుకూల పనితీరు) ప్రజల నుండి సేకరించే అభిప్రాయాలలో పురోగతి సాధించాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు వారి వారి శాఖలకు సంబంధించిన పనితీరుపై దృష్టి పెట్టి రాష్ట్రంలో జిల్లాను మెరుగైన స్థానంలో ఉండేలా కృషి చేయాలని తెలిపారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.

**ప్రజల నుండి అందిన విజ్ఞప్తులలో కొన్ని**

మదనపల్లి మండలం అంగళ్లకు చెందిన గ్రామస్తులు.. గ్రామంలో 3000 ఇండ్లు ఉన్నాయని, హంద్రీనీవా కాలువ ద్వారా త్రాగునీటిని విడుదల చేయాలని, అలాగే తొంగవారిపల్లె, ఎగువ మల్లయ్య కొండకు వెళ్లడానికి కాలువపై బ్రిడ్జి నిర్మించాలని అర్జీ సమర్పించారు. పుంగనూరు మండలం నేటిగుట్టవారిపల్లె పంచాయతీ అరంకు పల్లెకు చెందిన గ్రామానికి చెందిన జి వెంకటరమణ అరంకు పల్లె, కంబవారి పల్లె, పీర్లవారి ఇండ్లు, దిగువ కొండమీద పల్లె, ఆవులవారి పల్లె, ఏటిగడ్డ కమ్మపల్లె 6 గ్రామాల వారికి రేషన్ షాపు 12కిమీ దూరం ఉందని, ఈ గ్రామాల వారందరికీ దగ్గరలో ఒక రేషన్ షాపును నూతనంగా మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ కు అర్జీ సమర్పించుకున్నారు. కలకడ మండలం మండలం, ముడియం వారి పల్లె గ్రామానికి చెందిన షేక్ బాదుల్లా సాహెబ్... గ్రామంలో ఉన్న 1.92 ఎకరాల భూమిని పెద్దల కాలం నుండి సాగు చేసుకుంటున్నామని, ప్రస్తుతం ఈ భూమి చుట్టూ ఇతరులు కంచె వేశారని విచారణ చేసి తమకు న్యాయం చేయవలసిందిగా జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు.

ఈ కార్యక్రమంలో మొత్తం 316 అర్జీలు రాగా వాటిపై తగు చర్య తీసుకొని పరిష్కరించు నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎండార్స్ చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పరిశ్రమల స్థాపనకు అనుమతులు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్
- ఎంఎస్ఎంఈలకు రాయితీలు, పీఎంఈజీపి రుణాల మంజూరుపై ప్రత్యేక దృష్టి
- సింగిల్ డెస్క్ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి




**అన్నమయ్య బ్యూరో –సూర్య వాస్తవం:** జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేసేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవసరమైన అను మతులను సకాలంలో మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమ వారం జిల్లా కలెక్టరేట్ నందలి భారత్ సమావేశ హాల్‌లో జిల్లా పరిశ్రమలు మరియు ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలో సింగిల్ డెస్క్ విధానం ద్వారా పరిశ్రమల స్థాపనకు అందుతున్న దరఖాస్తుల పరిష్కారం, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు అందిస్తున్న వివిధ రాయితీలు, పీఎంఈజీపి పథకం అమలు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు.

**89 రోజుల్లో.. 26 దరఖాస్తులకు అనుమతులు**

గడచిన 89 రోజుల కాలంలో జిల్లాలో వివిధ పరిశ్రమల స్థాపన, అనుమతులు/రిన్యూవల్ కోసం సింగిల్ డెస్క్ విధానంలో మొత్తం 38 దరఖాస్తులు అందాయని కలెక్టర్ తెలిపారు. వీటిలో సంబంధిత శాఖల ద్వారా 26 పరిశ్రమలకు అనుమతులు/రిన్యూవల్ మంజూరు చేయగా, మరో 12 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని వెల్లడించారు. పరిశీలనలో ఉన్న దరఖాస్తులను నిర్దిష్ట గడువులోగా పరిశీలించి తగిన పరిష్కారం అందించాలని పర్యావరణ పరిరక్షణ, ఫ్యాక్టరీస్ శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పారిశ్రామికవేత్తలు అనవసర జాప్యానికి గురికాకుండా సింగిల్ డెస్క్ విధానంలో అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.

**4 యూనిట్లకు రూ.30.78 లక్షల పెట్టుబడి రాయితీలు**

చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించే చర్యల్లో భాగంగా పెట్టుబడి రాయితీ కింద జిల్లాలోని ఉత్పాదక రంగానికి చెందిన 4 యూనిట్లకు మొత్తం రూ.30.78 లక్షల విలువైన రాయితీల మంజూరుకు కమిటీ ఆమోదం తెలిపింది. పీఎంఈజీపి కింద 74 యూనిట్లకు రూ.2.26 కోట్ల మార్జిన్ మనీ

పీఎంఈజీపి పథకం ద్వారా 2026--27 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 74 యూనిట్లకు రూ.2.26 కోట్ల మేర మార్జిన్ మనీ విడుదల కానుందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే పీఎంఈజీపి కింద 27 యూనిట్లకు వివిధ బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరైనట్లు తెలిపారు. పీఎంఈజీపి కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సంబంధిత బ్యాంకులు త్వరితగతిన పరిశీలించి రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా పరిశ్రమల శాఖ అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణాన్ని కల్పిస్తూ పెట్టుబడులను ఆకర్షించడం, ఉపాధి అవకాశాలను పెంచడం లక్ష్యంగా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ సూచించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ కె. కృష్ణ కిశోర్, తరఫున ప్రవీణ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, పరిశ్రమల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వీధి కుక్కల సమస్య పరిష్కారానికి సమగ్ర సమావేశం

### - ప్రజల ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి -- కమిషనర్ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్

### -ప్రొద్దుటూరులో ప్రధాన సమస్యగా గ్రామసింహాలు



ప్రొద్దుటూరు, ఆగస్టు 31 సూర్య వాస్తవం: ప్రొద్దుటూరు పట్టణంలో వీధి కుక్కల సమస్యకు పరిష్కారం చూపేందుకు సమగ్ర చర్యలు చేపడుతున్నట్లు ప్రొద్దుటూరు పురపాలక సంఘం కమిషనర్ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ తెలిపారు. ఇటీవల నిర్వహిస్తున్న "ప్రజలతో కమిషనర్ ముఖాముఖి" కార్యక్రమంలో పట్టణ ప్రజల నుంచి వీధి కుక్కల సమస్యపై అనేక ఫిర్యాదులు అందిన నేపథ్యంలో, సమస్య తీవ్రతను పూర్తిగా అంచనా వేసి, పరిష్కార మార్గాలను రూపొందించేందుకు ప్రాథ మిక నివేదికను సిద్ధం చేయడం జరుగు తోందన్నారు. వీధి కుక్కల సమస్య ఒక్క మున్సిపాలిటీ పరిధికే పరిమితం కాకుండా చుట్టుపక్కల గ్రామాలు, మున్సిపాలిటీలకు కూడా సంబంధించిన అంశంగా ఉన్నందున, సమన్వ యంతో సమగ్ర పరిష్కారం సాధించేందుకు సమావేశం ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు. ఈ మేరకు ప్రొద్దుటూరు మున్సిపాలిటీ చుట్టూ ఉన్న ప్రధాన పంచాయతీలైన కొత్తపల్లె, దొరిసానిపల్లె, గోపవరం, సోములవారిపల్లె, చౌటపల్లె ప్రతినిధులతో పాటు, పరిసర మున్సిపాలిటీలైన మైదుకూరు, ఎర్రగుంట్ల, జమ్మలమడుగు, కమలాపురం మున్సిపల్ కమిషనర్లతో 07.09.2026 సోమవారం సాయంత్రం 4:00 గంటలకు ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయంలో సమగ్ర సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రొద్దుటూరు పట్టణంలో సుమారు 7 వేల వీధి కుక్కలు ఉన్నట్లు సమాచారం ఉన్నందున సంబంధిత అధికారు లందరితో సమావేశం నిర్వహించి సమగ్ర కార్యాచరణ చేపడుతున్నట్లు కమీషనర్ శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ప్రాధాన్యతగా పరిగణించి, ప్రజలకు ఇబ్బంది కలగ కుండా చట్టబద్ధమైన, మానవతా దృక్పథంతో కూడిన శాస్త్రీయ పరిష్కార మార్గాలను అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని కమిషనర్ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ పేర్కొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )

## టిడిపి కేంద్ర కార్యాలయంలో
# మీడియాతో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం:**వెలిగొండ ప్రాజెక్టుకు జీవం పోసింది ఎన్టీఆర్ తీసుకొచ్చిన 409 జీవో

రాయలసీమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది.వెలిగొండ ప్రాజెక్టుకు జీవం పోసిన ఘనత స్వర్గీయ నందమూరి తారక రామారావు కే దక్కుతుంది. ఆయన తీసుకొచ్చిన 409 జీవోతో వెలిగొండ ప్రాజెక్టుకు పునాది పడింది. అనంతరం చంద్రబాబు నాయుడు దూరదృష్టి, పట్టుదలతో ప్రాజెక్టు పనులు ముందుకు సాగాయి. వెలిగొండ ప్రాజెక్టు విషయంలో క్రెడిట్ చోరీ చేసుకోవడం కోసం సాక్షి మీడియా వాస్తవాలను వక్రీకరించడం పరిపాటిగా మార్చుకుంది. వాస్తవాలను ప్రజల ముందు ఉంచకుండా మూడు రోజులు ముందు, మూడు రోజులు వెనుక జరిగిన విషయాలను ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోంది. జగన్ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.1,200 కోట్లతో మట్టి పనులు చేపట్టి వాటినే గొప్పగా ప్రచారం చేసుకున్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా నిర్వాసితులకు పునరావాసం కల్పించాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపై ఉంది. దాన్ని కూడా రాజకీయ ప్రచారానికి ఉపయోగించుకోవడం సరికాదు.ఇరిగేషన్ ప్రాజెక్టుల గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదు. ఆయన హయాంలో రాయలసీమకు సంబంధించిన అనేక ప్రాజెక్టులను పక్కన పెట్టారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అందుబాటులో ఉన్న నిధులను సైతం సద్వినియోగం చేసుకోలేకపోయారు. ఫలితంగా రాయలసీమకు సాగునీరు అందించడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.

నాడు--నేడు కార్యక్రమాల్లో సైతం భారీ స్థాయిలో అవినీతి జరిగిందని ఆరోపణలు ఉన్నాయి. జగన్ చుట్టూ ఉన్న నాలుగు స్తంభాలు విజయసాయిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైవీ సుబ్బారెడ్డి. ఇప్పుడు వారిలో ఒకరు అప్పటి పాలనకు సంబంధించిన వాస్తవాలు బయటకు వస్తున్నాయి. రాష్ట్రాన్ని ప్రాంతాల వారిగా ఇసుక, మద్యం, మైనింగ్‌లను పంచుకుని దోపిడీ చేశారు .
నాడు నేడు కార్యక్రమం ద్వారా 11 వేల కోట్ల రూపాయలు జగన్ తన అనునాయులతో కలిసి దోచుకున్నారు.
రాయచోటి, పీలేరు, తంబళ్లపల్లె, కుప్పం వంటి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి చంద్రబాబు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది.
2019లోనే చంద్రబాబు ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చి ఉంటే రాయలసీమలోని అనేక సాగునీటి ప్రాజెక్టులు ఈపాటికే పూర్తయ్యేవని ప్రజలు భావిస్తున్నారు.
ప్రాజెక్టులు పూర్తయి ఉంటే ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఎల్నినో పరిస్థితులను మరింత సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశం ఉండేది.

డ్రిప్ ఇరిగేషన్‌ను ప్రోత్సహిస్తూ సబ్సిడీలతో రైతులకు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా రాయలసీమలో వ్యవసాయానికి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. రాబోయే రోజుల్లో సుమారు రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులతో హార్టికల్చర్ ఆధారిత ఆర్థిక వ్యవస్థను రాయలసీమలో అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.
రాష్ట్రంలో ఏ మంచి కార్యక్రమం జరిగినా దానికి వైసీపీ నేతల ఓర్వలేకపోతున్నారు.
కృష్ణా నది నీటి ప్రవాహాలను అడ్డుకునే శక్తి, ధైర్యం ఏ వైసీపీ నాయకుడికీ లేదు.
రాయలసీమ అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, రైతుల సంక్షేమమే చంద్రబాబు ప్రభుత్వ లక్ష్యం. వెలిగొండతో పాటు పెండింగ్‌లో ఉన్న ప్రతి సాగునీటి ప్రాజెక్టును పూర్తి చేసి రాయలసీమకు శాశ్వత నీటి భద్రత కల్పించడమే ప్రభుత్వ సంకల్పం.

## నేడుఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ
### -రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి



**రాయచోటి-సూర్య వాస్తవం:** రాయచోటి మండల పరిధిలోని గ్రామ పంచాయతీ కేంద్రమైన శిబ్యాలలో నేడు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో టిడిపి గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు భూతి ఇన్చార్జిలు పాల్గొని విజయవంతం చేయాలని రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ అనుపల్లి రాంప్రసాద్ రెడ్డి కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు అర్హులైన లబ్ధిదారులందరికి సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.పేదల జీవితాల్లో ఆర్థిక భరోసా కల్పించడమే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం ప్రధాన ఉద్దేశ్యం అని అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పెన్షన్ సకాలంలో అందేలా చూడటం మనందరి బాధ్యత" అని చెప్పారు.శిబ్యాల గ్రామంలోని వార్డుల్లో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులకు సహాయ కార్యక్రమాలు చేయాలని కోరారు .

## ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత





**బ్రహ్మంగారిమఠం -సూర్య వాస్తవం :**ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని జిల్లా తెదేపా పార్టీ ఉపాధ్యక్షుడు కానాల మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన బ్రహ్మంగారిమఠంలోని ఇంటిగ్రేటెడ్ సమీకృత వసతి సముదాయంను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కానాల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ సందర్భంగా కానాల మల్లికార్జునరెడ్డి ని శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సమీకృత సంక్షేమ వసతి అధికారి మునెయ్య ,వార్డెన్ నరసింహారెడ్డి తదితరులు ఉన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలు,వినాయక చవితి నేపథ్యంలో
# గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు

- **ప్రశాంత వాతావరణంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగేలా ప్రజలకు పోలీసుల అవగాహన.**
- **పల్లెనిద్రలో భాగంగా గ్రామాల్లో పర్యటించి ప్రజలతో నేరుగా మమేకమైన పోలీసు అధికారులు.**
- **గంజాయి,మాదకద్రవ్యాలు,సైబర్ నేరాలు, మహిళలు--చిన్నారులపై నేరాలపై అవగాహన.**
- **బాల్య వివాహాలు,పోకసోచట్టం,టీనేజ్ ఆకర్షణలు, సోషల్ మీడియా వినియోగంపై సూచనలు.**
- **రోడ్డు భద్రత,వినాయక చవితి వేడుకల సందర్భంగా పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన.**
- **అత్యవసర పరిస్థితుల్లో డయల్-112ను వినియోగించుకోవాలని సూచన.**




**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు,ఆదేశాల మేరకు జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు అధికారులు గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలతో నేరుగా మమేకమై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీకాళహస్తి పట్టణంలోని బృందమ్మ కాలనీలో ప్రజలతో మాట్లాడి గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం,సైబర్ నేరాలు, మహిళలు మరియు చిన్నారులపై నేరాల నివారణ, స్థానిక సమస్యలపై అవగాహన కల్పించారు.ఓబులవారిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్నంపల్లి గ్రామంలో పల్లెనిద్రలో భాగంగా ప్రజలతో సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికలను ఎలాంటి అవాంఛనీయ, హింసాత్మక ఘటనలకు తావులేకుండా



ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని సూచించారు. సమస్యలు సృష్టించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంటు oదని, రౌడీషీటర్లు,ట్రబుల్ మంగర్స్‌పై అవసరమైన చట్టపరమైన, బైండోవర్ చర్యలు చేపడతామని హెచ్చరించారు.

అదేవిధంగా బాల్య వివాహాలు,గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు,పోకసో చట్టం,సైబర్ నేరాలు,సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు,టీనేజ్ ఆకర్షణలు,తొందరపాటు ప్రేమ వివాహాల వల్ల ఎదురయ్యే సమస్యలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.సూళ్లూరుపేట పట్టణంలోని మన్నారుపోలూరు గ్రామం (వార్డు నం.21)లో పోలీసు అధికారులు ప్రజలతో సమావేశమై రాబోయే మున్సిపల్ ఎన్నికలు,వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పాటించాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు.సైబర్ నేరాలు, మహిళలపై నేరాలు,గంజాయి వినియోగం,రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు.సత్యవేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని పాలగుంట, వెంకటగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమసానిగుంట గ్రామాల్లో పోలీసు అధికారులు పర్యటించి గ్రామస్తులతో స్థానిక, రాజకీయ సమస్యలపై చర్చించారు.రాబోయే ఎన్నికలు, రోడ్డు భద్రత,సైబర్ నేరాలు,మాదకద్రవ్యాల వ్యతిరేకత,మహిళలపై నేరాల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

పాదిరేడు గ్రామంలో గంజాయి, సైబర్ నేరాలు,మహిళలపై నేరాలు,రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడంతో పాటు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు,వినాయక చవితి సందర్భంగా పాటించాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు.ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,ఎన్నికలు మరియు పండుగల సమయంలో సంయమనం పాటిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని జిల్లా పోలీసు శాఖ సూచించింది. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్-112కు సమాచారం అందించాలని కోరారు.

## మహిళా భద్రత, ట్రాఫిక్, సైబర్ నేరాలపై అవగాహన



**మైదుకూరు -సూర్య వాస్తవం:** జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఆదేశాల మేరకు మైదుకూరు ఎస్.ఐ కె.వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రజలతో సమావేశమై మహిళల భద్రత, ట్రాఫిక్ నియమాలు, సైబర్ నేరాల నివారణ అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మహిళలు, బాలికల భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ట్రాఫిక్ నిబంధనల పాటింపు, హెల్మెట్ వినియోగం, సైబర్ మోసాల పట్ల అప్రమత్తతపై వివరించారు. గుర్తుతెలియని వ్యక్తుల కాల్స్, అనుమానాస్పద లింకులు, ఓటీపీలు, బ్యాంకింగ్ వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు.

# పట్టపగలే సినీ ఫక్కీలో చోరీ

**- బ్యాంకు నుంచి నగదు తీసుకొస్తున్న వ్యక్తి వద్ద రూ.3.20 లక్షలు అపహరణ**
**- సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్న పోలీసులు**




**నాయుడుపేట- సూర్య వాస్తవం** :నాయుడుపేట పట్టణంలోని నడిబజారులో పట్టపగలే సినీ ఫక్కీలో భారీ చోరీ జరగడంతో పట్టణంలో కలకలం రేగింది. బ్యాంకు నుంచి నగదు డ్రా చేసుకుని బయటకు వచ్చిన ఓ వ్యక్తిని గుర్తుతెలియని వ్యక్తి వెంబడించి, అతని వద్ద ఉన్న రూ.3.20 లక్షల నగదును అపహరించుకుని పరారైనట్లు సమాచారం.వివరాల్లోకి వెళితే.. మేరిగ వెంకటకృష్ణయ్య అనే వ్యక్తి సోమవారం మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో బ్యాంకు నుంచి రూ.3.20 లక్షల నగదును డ్రా చేసుకుని బయటకు వచ్చారు. ఈ క్రమంలో ఆయనను గుర్తుతెలియని వ్యక్తి వెంబడించినట్లు తెలుస్తోంది. అనంతరం అదును చూసుకుని సినిమా తరహాలో నగదును అపహరించుకుని అక్కడి నుంచి పరారైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఘటనపై సమాచారం అందుకున్న నాయుడుపేట పట్టణ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శివశంకర్ పోలీసు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. చోరీ జరిగిన ప్రాంతంతో పాటు పరిసరాల్లోని సీసీ కెమెరాల దృశ్యాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. నిందితుడి కదలికలను గుర్తించి అతడిని పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు.

### బ్యాంకుల వద్ద భద్రతపై ఆందోళన

నడిబజారులో, అదీ పట్టపగలే బ్యాంకు సమీపంలో ఈ తరహా చోరీ జరగడంతో స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకుల నుంచి పెద్ద మొత్తంలో నగదు తీసుకుని బయటకు వచ్చే వారిని దొంగలు లక్ష్యంగా చేసుకుంటున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బ్యాంకుల వద్ద అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులపై నిఘా పెట్టడంతో పాటు, నగదు తీసుకునే ఖాతాదారులకు భద్రత కల్పించేందుకు పోలీసులు, బ్యాంకు సిబ్బంది సమన్వయంతో చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## ఘనంగా శ్రీ సంకటహర చతుర్థి గణపతి వ్రతం



బ్రహ్మంగారిమఠం, సూర్య వాస్తవం ఆగస్టు 31: బ్రహ్మంగారిమఠం మండలంలోని కందిమల్లాయపల్లి గ్రామంలో గల జగద్గురు శ్రీ ఈశ్వరీదేవి మఠంలో కొలువై ఉన్న శ్రీ సంకటహర గణపతి స్వామివారి సన్నిధిలో శ్రీ సంకటహర చతుర్థి గణపతి వ్రతాన్ని సోమవారం విశేషంగా శ్రీ ఈశ్వరి దేవి మఠం మఠాధిపతి శ్రీ వీర శివకుమార స్వామివారు చేతుల మీదుగా నిర్వహించారు.ఈ పుణ్యకార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ స్వామివారి దివ్య అనుగ్రహాన్ని పొందారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను నిర్వాహకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మఠాధిపతి సోదరులు శ్రీ సంపత్ కుమార్ స్వామి, సిబ్బంది ఉన్నారు.

## మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశాలతో హెచ్ఎన్ఎస్ఎస్ అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన...!

- 36ఏ, 36బీ ప్యాకేజీల ద్వారా నీటి సరఫరా అవకాశాల పరిశీలన
- హనుమిరెడ్డిపల్లి, కోనాపురం చెరువుల్లో అధికారుల పరిశీలన



**ఉరవకొండ - సూర్య వాస్తవం :** రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశాల మేరకు హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు ఉరవకొండ నియోజకవర్గం బెలుగుప్ప మండలంలోని హనుమిరెడ్డిపల్లి, కోనాపురం చెరువులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి హెచ్ఎన్ఎస్ఎస్ 36ఏ, 36బీ ప్యాకేజీల ద్వారా ఆయా చెరువులకు నీటిని అందించే సాంకేతిక అవకాశాలను అధికారులు పరిశీలించారు. చెరువులకు నీటిని అందించడం ద్వారా పరిసర ప్రాంతాల్లోని బోర్‌వెల్స్‌ను రీచార్జ్ చేయడంతో పాటు గ్రామాల తాగునీటి అవసరాలను తీర్చే అవకాశాలపై అధికారులు అధ్యయనం చేశారు. తదుపరి దశలో మరిన్ని చెరువులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నీటి సరఫరాకు సాధ్యమైన ప్రతిపాదనలను రూపొందించనున్నారు. తాగునీటి సమస్యకు పరిష్కారం చూపడంతో పాటు భూగర్భ జలాలను రీచార్జ్ చేసేందుకు తక్షణ చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

## చంద్రన్న బీమా చెక్కును అందజేసిన టిడిపి నాయకులు

### పార్టీ నమ్ముకున్నందుకు న్యాయం చేకూర్చింది



**పామిడి - సూర్య వాస్తవం :** పామిడి పట్టణానికి చెందిన టిడిపి కార్యకర్త శ్రీపురంమురళి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించడం జరిగింది. ఈసందర్భంగా వారి కుటుంబ సభ్యులు చంద్రన్న ప్రమాద బీమా టీడీపీ సభ్యత్వం నమోదు చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యా శాఖమంత్రి నారాలోకేష్ గుంతకల్లు నియోజకవర్గ శాసనసభ్యులు గుమ్మనూరుజయరాం, ఆయన తనయుడు యువనేత పామిడి మరియు గుత్తి ఇన్చార్జి గుమ్మనూరుఈశ్వర్ చొరవతో చంద్రన్న ప్రమాదబీమా చెక్కు ఐదులక్షల రూపాయలు మంజూరు కావడంతో సోమవారం పామిడి టిడిపి నాయకులు మృతుడు శ్రీపురం మురళి కుటుంబానికి ఆ చెక్కును అందించారు. ఈ సందర్భంగా శ్రీపురం మురళి కూతుర్లు బోయనిర్మల, లావణ్యలు మాట్లాడుతూ మా కుటుంబాని పెద్ద దిక్కు అయినా మాతల్లి మరణించడం, ఆ తరువాత మూడు నెలలకే మా తండ్రి మురళి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో దిక్కుతోచని విషాదం చోటు చేసుకున్న సందర్భంగా పార్టీని నమ్ముకున్నందుకు గాను మాకు అండగా నిలిచినందని,తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు,మా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆయన తనయుడు ఇన్చార్జ్ గుమ్మనూరుఈశ్వర్, మండల టిడిపి నాయకులకీ జీవితాంతం రుణపడి ఉంటామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బొమ్మ మోహనకృష్ణ, బొల్లుశ్రీనివాసరెడ్డి, సంజీవకుమార్, కుమార్, రాజు, సుంకప్ప, రాము,శివ శంకర్,శ్రీరాములు, బసవరాజు, చిరంజీవి, తిరుమలరావు రామకృష్ణ, కార్యకర్తలు పామిడి పట్టణ, మండల టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అలంకరణలో గంభీరంగా గుడ్ల వీరభద్ర స్వామి



**పామిడి - సూర్య వాస్తవం:** పామిడి మండలంలోని తంబళ్లపల్లి గ్రామం పొలిమేర ప్రాంతంలో పెద్దవడుగూరు సమీపాన వెలసిన వీరభద్ర స్వామి భద్రకాళి అమ్మవారు శ్రావణ మూడవ సోమవారాన్ని నమస్కరించుకొని ప్రత్యేక అలంకరణలో విరజిల్లు తున్న (గుడ్ల వీరన్న స్వామి) వారికి శ్రావణమాసం మూడవ సోమవారం వేకుజామున అర్చకులు రవీంద్రయ్య అభిషేకాలు అర్చనలు ఆకు పూజలతో ఆలయకమిటీ, ఇంటిఇలవేల్పు గుడ్లవీరన్న భక్తాదులందరూ కలిసి పూజలు వైభవంగా చేశారు. మధ్యాహ్నం, రాత్రికి అన్నదాన కార్యక్రమసేవ, ఆధ్యాత్మికతలో భాగంగా ప్రతిరోజు సాయంకాలం భజనల కార్యక్రమలు నిర్వహిస్తున్నారు. ఆలయంలో ఆధ్యాత్మిక శోభచేకూరింది. భక్తాదులు మహిమాత్మకత స్వామిని దర్శించుకోవడానికి పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వీరభద్రస్వామి ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లు సమకూర్చారు. వీరభద్ర స్వామికి వెండి కనుగుడ్లను కానుకగా సమర్పించారు

## పదవీ విరమణ సన్మాన సభ



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి మండలం బేతాపల్లి గ్రామా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు పని చేయుచున్న బికే సుధారాణిది సోమవారం పదవి విరమణ సన్మాన సభ డాక్టర్ కే ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ కే.ప్రవీణ్ కుమార్ డాక్టర్ దేవేంద్రనాయక్. ప్రాథమిక ఆరో గ్య సిబ్బంది,బంధుమిత్రులు ఆత్మీయులు హాజరై పదవీ విరమణ శుభాకాంక్షలు తెలి యజేశారు.వైద్య ఆరోగ్యశా ఖలో 41 సంవత్సరాలు ప్రజలకు సేవలు అందించి అధికారులకు ప్రజల మన్న లు పొందినది. ఏఎన్ఎంనుం చి సూపర్వైజర్ పీహె ఎన్, సిహెచ్ఓ వివిధ క్యాడర్లలో 41.సంవత్సరము లు పని చేసినారు. ఆమె శేష జీవి తము ఆయురారోగ్యాలతో గడపా లని వక్తులు పేర్కొన్నారు.తదనంత రం పదవి విరమణ కార్యక్రమం నూ సన్మాన గ్రహీత సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కేసి రెడ్డ మ్మ.సి వెంకటేష్. డిప్యూటీ హెచ్ ఈ ఓ.నిరీష, గీత, స్టాఫ్ నర్సులు, ఏఎన్ ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

### ఉద్యోగుల హక్కుల సాధనకు దశలవారీగా

# ఏపీ జెఎసి అమరావతి ఉద్యమం

- మేము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదు.. ప్రభుత్వంలో భాగమే: ఆర్.ఎన్. దివాకర్‌రావు...!
- ఏపీజేఏసీ అమరావతి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 నుంచి నిరసన కార్యక్రమాలు
- న్యాయబద్ధమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్
- జేసీ విష్ణు చరణ్‌కు ఉద్యమ కార్యాచరణ నోటీసు అందజేత




**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** ఉద్యోగుల హక్కులు, ఆత్మగౌరవం, ఆర్థిక ప్రయోజనాల సాధన కోసం ఏపీజేఏసీ అమరావతి ఆధ్వర్యంలో దశలవారీ ఉద్యమాన్ని చేపట్టనున్నట్లు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం అనంతపురం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ సి.విష్ణు చరణ్, ఐఏఎస్‌ను కలిసి ఉద్యమ కార్యాచరణకు సంబంధించిన నోటీసును అందజేశారు. రాష్ట్ర స్థాయిలో ఏపీజేఏసీ అమరావతి రూపొందించిన ఉద్యమ కార్యాచరణను జిల్లాలోనూ అమలు చేయనున్నట్లు సంఘాల నాయకులు తెలిపారు. ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతూ దశలవారీగా నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

**సెప్టెంబర్ 1 నుంచి తొలి దశ**

మొదటి దశ ఉద్యమం సెప్టెంబర్ 1 నుంచి 11వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. సెప్టెంబర్ 1న "సీఎం సార్.. మా డబ్బులు మాకివ్వండి" అనే నినాదంతో సెల్‌ఫోన్ డీపీలు ఏర్పాటు చేసి నిరసన తెలపడంతో పాటు, సెప్టెంబర్ 1 నుంచి 5వ తేదీ వరకు ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతారని పేర్కొన్నారు.

సెప్టెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు 'హ్యాండ్ టు హ్యాండ్' కార్యక్రమం ద్వారా కార్యాలయాలను సందర్శించి ఉద్యోగులను ఉద్యమంలో భాగస్వామ్యం చేయనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు భోజన విరామ సమయంలో నిరసనలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సెప్టెంబర్ 11న జిల్లా కేంద్రంలో కార్మిక, ఉద్యోగ సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణపై చర్చించనున్నట్లు తెలిపారు.

**రెండో దశలో మరింత ఉధృతం**

రెండో దశ ఉద్యమాన్ని సెప్టెంబర్ 15 నుంచి 26వ తేదీ వరకు చేపట్టనున్నట్లు ఉద్యోగ సంఘాల నాయకులు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి వర్క్ టు రూల్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 15 నుంచి 22వ తేదీ వరకు సోషల్ మీడియాలో డీపీలు, ఫొటోలు, రీల్స్ ద్వారా ఉద్యమాన్ని ప్రచారం చేయనున్నారు. సెప్టెంబర్ 15 నుంచి 25వ తేదీ వరకు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 17న నల్ల కండువాలతో నిరసన చేపట్టి "సీఎం సార్.. మా డబ్బులు మాకివ్వండి" అనే నినాదంతో మానవహారం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సెప్టెంబర్ 23న కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయాల వద్ద ధర్నాలు, సెప్టెంబర్ 26న ఉద్యోగుల కుటుంబ సభ్యులతో కలిసి "మా డబ్బులు మాకివ్వండి" నినాదంతో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం మూడో దశలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసే కార్యక్రమాలను చేపడతామని ప్రకటించారు.

**ప్రభుత్వ పెద్దల వ్యాఖ్యలపై తీవ్ర ఖండన**

ఉద్యోగుల సమస్యలపై ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ చేస్తున్న డిమాండ్లను రాజకీయ కోణంలో చూడటం సరికాదని అనంతపురం ఏపీజేఏసీ అమరావతి నాయకులు పేర్కొన్నారు. ఉద్యోగుల హక్కులు, న్యాయబద్ధమైన డిమాండ్ల సాధన కోసం మాత్రమే తాము ఉద్యమిస్తున్నామని స్పష్టం చేశారు. ఉద్యోగుల న్యాయబద్ధమైన డిమాండ్లను కోరుతున్న సందర్భంలో రాజకీయ ఎజెండా, కుట్ర కోణం, అతిపోకడలు వంటి వ్యాఖ్యలు చేయడం ఉద్యోగ వర్గాన్ని బాధించిందన్నారు. ఉద్యోగ సంఘాలు ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, తాము ప్రభుత్వంలో భాగమని పేర్కొన్నారు. ఉద్యోగులకు రావాల్సిన హక్కులు, ఆర్థిక ప్రయోజనాలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. భవిష్యత్తులో ఉద్యోగ సంఘాల ఉద్యమాలపై అనుచిత వ్యాఖ్యలు చేయకుండా ప్రభుత్వ పెద్దలు సంయమనం పాటించాలని కోరారు.

**భారీగా పాల్గొన్న ఉద్యోగ సంఘాల ప్రతినిధులు**

ఈ కార్యక్రమంలో ఏపీజేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ ఆర్.ఎన్. దివాకర్‌రావు, జనరల్ సెక్రెటరీ పి.ఎస్. ఖాన్, అసోసియేట్ చైర్మన్ బి. మల్లారాయుడు, కోశాధికారి పి. సంతోష్‌గౌడ్, మహిళా విభాగం చైర్‌పర్సన్ బి. సురేఖరావు, జనరల్ సెక్రెటరీ ఎం. నాగవేణి, శివానందరెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ తోట చెన్నప్ప, రెవెన్యూ అసోసియేషన్ సెక్రెటరీ సోమశేఖర్, కోశాధికారి, అనంతపురం సిటీ యూనిట్ చైర్మన్ వి. పునీత్‌బాబు, రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసమూర్తి, టైపిస్టు అండ్ ఆర్గనైజేషన్ సెక్రెటరీ వెంకట శివప్రసాద్, వర్క్ చార్జ్ అధ్యక్షులు కలందర్, ఔట్‌సోర్సింగ్ అధ్యక్షులు భాస్కర్, గుంతకల్ డివిజన్ చైర్మన్ చంద్రమోహన్, కళ్యాణదుర్గం చైర్మన్ ఈ. వెంకటేష్, గురుబ్రాహ్మ, వీఆర్ఓ అసోసియేషన్ వెంకట నరసయ్య, వీఆర్ఏ అసోసియేషన్ అధ్యక్షులు వి. ఓబులేసు, సెక్రెటరీ నాగరాజు, గ్రామ వార్డు సచివాలయ సంఘం నాయకులు శివకుమార్, నజీర్, మారుతి, సీమ, కృష్ణవేణి, చంద్రరేఖ, నీరజ, రాజి, ప్రసన్న తదితర వివిధ శాఖల ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





# గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం...!

### చాగి గ్రామపంచాయతీ నూతన భవనానికి భూమిపూజ
### రూ.38 లక్షల గ్రాంట్‌తో నిర్మాణం.. త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి



**ఆదోని - సూర్య వాస్తవం :** గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నాయకులు చాగి మల్లికార్జున రెడ్డి అన్నారు. ఆదోని మండలం చాగి గ్రామంలో గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణానికి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. గ్రామ టీడీపీ నాయకులు, గ్రామస్తులతో కలిసి భవన నిర్మాణానికి కేటాయించిన స్థలంలో భూమిపూజ చేసి మార్కింగ్ చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో చాగి గ్రామ పంచాయతీ అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గ్రామ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఇప్పటికే గ్రామంలోని ఎస్సీ కాలనీలో సుమారు రూ.30 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. గ్రామంలో ఇంకా చేపట్టాల్సిన రోడ్లు, కాలువలు, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి గ్రామసభల ద్వారా ప్రతిపాదనలు, అంచనా నివేదికలను ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే రూ.38 లక్షల గ్రాంట్‌తో గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణానికి భూమిపూజ నిర్వహించినట్లు చెప్పారు. భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి గ్రామ ప్రజలకు సేవలు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను ప్రజలు గెలిపిస్తే చాగి గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి చూపిస్తామని మల్లికార్జున రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో చాగి టీడీపీ నాయకులు కే.రాము, గూళెప్ప, ఎర్రిస్వామి, కుమ్మరి మల్లప్ప, మల్లికార్జున గౌడ్, ఆదోని బసవరాజు, మల్లారెడ్డి, ఆకుల వెంకటేష్, స్వామి, రాజు తదితర గ్రామ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.